



వైసీపీ నాయకుల తాట తీస్తా : జగ్గంపేట సభలో ఆవేశంగా మాట్లాడుతున్న పవన్



ఓటర్లూ గుర్తుపెట్టుకోండి : ప్రత్తిపాడులో పవన్‌తో కలిసి గాజు గ్లాసు, సైకిల్ గుర్తులు చూపుతున్న ఎంపీ అభ్యర్థి ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్యే అభ్యర్థిని సత్యప్రభ

నేను ఇక్కడే ఉన్నా : జగ్గంపేట సభలో జనానికి వంగి అభివాదం చేస్తున్న పవన్ కల్యాణ్

అండగా నేనుంటా..

ప్రత్తిపాడు, జగ్గంపేట వారాహి యాత్రలో పవన్‌కల్యాణ్



మీ ఓటు జ్యోతిలా వెలగాలి : కిర్లంపూడి సభలో పవన్ పక్కన నిలబడి మాట్లాడుతున్న జ్యోతుల నెహ్రూ.. చిత్రంలో ఉదయ్‌శ్రీనివాస్, నవీన్ తదితరులు



అన్నొచ్చాడు : జగ్గంపేట రోడ్ షోలో పవన్‌కు జైకొడుతున్న అభిమానులు



జయహో పవన్ : ప్రత్తిపాడు రోడ్ షోలో అభిమానుల ఉత్సాహం

ఏలేశ్వరం/ జగ్గంపేట/ జగ్గంపేట రూరల్/ కిర్లంపూడి, ఏప్రిల్ 28 : మైనింగ్‌ను అక్రమంగా దోచేందుకే ప్రత్తిపాడు నియోజకవర్గంపై వైసీపీ నాయకులు కన్నువేశారని జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ అన్నారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం ఏలేశ్వరంలో ఆదివారం నిర్వహించిన జనసేన బహిరంగ సభలో పవన్ మాట్లాడారు. ప్రత్తిపాడు మండలంలో లేటరైట్ పేరుతో బాక్సైట్‌నూ తరలించుకుపోతున్నారన్నారు. మాఫియా డాన్ కాకినాడ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి తమ్ముడు లంపకలోవలో ఉన్న వీరభద్ర కంపెనీకి అనువుగా రోడ్డు, బ్రిడ్జి నిర్మించుకున్నారుకానీ నియోజకవర్గంలో ఉన్న రోడ్లను, ప్రజల సమస్యలను నిర్లక్ష్యంగా వదిలేశారన్నారు. ఏలేరు ప్రాజెక్టు, సుబ్బారెడ్డిసాగర్, చంద్రబాబు సాగర్‌లను వైసీపీ ప్రభుత్వం గాలికొదిలేసిందన్నారు. కూటమి అధికారంలోకి రాగానే వంతాడ అక్రమ మైనింగ్ ఆపుతానన్నారు. పెద్దమల్లాపురం కేంద్రంగా ప్రత్యేక మండలాన్ని ఏర్పాటుచేసి గిరిజనులకు మేలు చేస్తానన్నారు. 72 ఎయిడెడ్ స్కూల్స్, కళాశాలలను తీసేసిన ఘనత జగన్ ప్రభుత్వానిదేనన్నారు. ఎయిడెడ్ పాఠశాలలను కూటమి ప్రభుత్వంలో పునరుద్ధరిస్తామన్నారు. కాకినాడ జిల్లాలో ఉన్న ఏడు నియోజకవర్గాల్లో ప్రజలకు అండగా ఉంటానన్నారు. దళితుడైన డ్రైవర్ సుబ్రహ్మణ్యంను హత్యచేసి డోర్ డెలివరీ చేసిన అనంతబాబుకు సీఎం ప్రాధాన్యం ఇవ్వడం పలు అనుమానాలను రేకెత్తిస్తోందన్నారు. జగన్ పార్టీ తరపున ఎంపీ అభ్యర్థిగా ఉన్న చలమలశెట్టి సునీల్‌ను ఓటర్లు నిలదీయాలన్నారు. కాకినాడ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి నీడను కూడా ప్రత్తిపాడుపై పడనీయబోయనని స్పష్టంచేశారు. కూటమి అధికారంలోకి వస్తే ప్రతి కార్పొరేషన్‌కు పూర్తిస్థాయిలో నిధులు కేటాయిస్తామన్నారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా వరుపుల సత్యప్రభ, గాజుగ్లాసు గుర్తుపై ఓటు వేసి ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌ను గెలిపించాలన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ మాట్లాడుతూ నిత్యపోరాటయోధుడు పవన్‌కల్యాణ్ నీతికి నిలబడే వ్యక్తి అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, మీసాల రాజు, గాటా బాలుదొర, బాబి తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట అభివృద్ధికి కృషి

ప్రతి చేతికి పని, ప్రతి చేనుకు నీరందించడమే ముఖ్య లక్ష్యమని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అన్నారు. జగ్గంపేట నియోజకవర్గ సమస్యలపై కిర్లంపూడిలో నిర్వహించిన వారాహి సభలో పవన్ మాట్లాడారు. 'మల్లవరం ప్రాజెక్టుకు రూ.132 కోట్లు అంచనా వేసి రెండుసార్లు శంకుస్థాపన చేసి కూడా ప్రభుత్వం నిధులు ఇవ్వలేదన్నారు. పుష్కర ఎత్తిపోతల పథకం నిర్వీర్యమైపోయిందన్నారు. పోలవరం మట్టి గట్లను తవ్వేస్తున్నా జలవనరులశాఖ చోద్యం చూస్తుందని మండిపడ్డారు. కిర్లంపూడి మండలం బూరుగుపూడి 175 ఎకరాల దుస్లాం చెరువును వైసీపీ ప్రతినిధులు ఆక్రమించేశారని తెలిపారు. గోకవరంలో పంచాయతీ స్థలాల్లో లాడ్జిలు నిర్మించారన్నారు. వైసీపీ శ్రేణులు రామేశ్వరంమెట్ట మట్టి తరలించుకుపోయి కోట్లాది రూపాయలు వెనకేసుకున్నారన్నారు. పుష్కర ఎత్తిపోతల పథకం నీరురాక 30 వేల ఎకరాలు ఎండితున్నా కనీస స్పందన లేదన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక కిర్లంపూడికి డిగ్రీ కాలేజీ తెస్తాం. ఏలేరు ఆధునికీకరణ చేస్తాం. మల్లవరం సాగునీటి ప్రాజెక్టు పూర్తిచేస్తాం' అని స్పష్టంచేశారు. జగన్ గత ఎన్నికల్లో కాపులకు రిజర్వేషన్ ఇవ్వలేనని చేతులెత్తేశారని, అప్పుడు జగన్‌ను అడగలేకపోయారని, ఈ డబ్ల్యూసీ పథకం కింద టీడీపీ ఐదు శాతం ఇస్తే దాన్నీ వైసీపీ తుంగలోకి తొక్కిందన్నారు. ఇక్కడ ఉద్యమ నాయకులు సినిమాల్లో రంగులేసుకునే వారని హేళన చేస్తున్నారు తప్పితే కాపులకు మంచి చేస్తే ఆనందపడేవాడినన్నారు. కూటమి ప్రభుత్వంలో అన్ని కులాలకు సమన్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

- మైనింగ్ మాఫియా ఆట కట్టిస్తా
- నాకు అన్ని కులాలు సమానమే
- సమస్యల పరిష్కారంపైనే దృష్టి
- ప్రతి చేతికి పని.. ప్రతి చేనుకు నీరే లక్ష్యం



పవన్‌కు పూలమాల వేస్తున్న జ్యోతుల



ప్రత్తిపాడు సభకు హాజరైన జనం

కూటమి ప్రభుత్వం రాగానే సమస్యలు పరిష్కరిస్తా

కాకినాడ ఎంపీ కూటమి అభ్యర్థి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్

జనసేన పార్టీ అంటే జెండా కాదు.. అజెండా ఉన్న పార్టీ. ప్రత్తిపాడు నియోజకవర్గంలో మైనింగ్, రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీటి సమస్య అధికంగా ఉంది. కాకినాడ పోర్టు అభివృద్ధి చేయరు, రైల్వే జోన్ పట్టించుకోరు. సెజ్ భూములను చిత్తశుద్ధితో పట్టించుకుని పరిశ్రమలు తీసుకొస్తే ఆరు లక్షల మందికి ఉద్యోగం కల్పించవచ్చు. సెజ్ భూములను రియల్ ఎస్టేట్‌లా వాడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సమస్యలను నెరవేరుస్తాను.

యువత భవిష్యత్ కోసమే పవన్ ఆరాటం..

ప్రత్తిపాడు నియోజకవర్గ అభ్యర్థి వరుపుల సత్యప్రభ

రాష్ట్రం కోసం, రాష్ట్రంలో ఉన్న యువత భవిష్యత్ కోసం అండగా నిలబడి కూటమి గెలుపు కోసం పవన్‌కల్యాణ్ ఎంతో కృషి చేస్తున్నారు. నా భర్త రాజా మరణం అనంతరం అండగా నిలిచి ధైర్యం చెప్పిన చంద్రబాబు రుణం తీర్చుకోలేనిది. కూటమి అభ్యర్థిగా నన్ను గెలిపించడానికి నాకు మద్దతు ఇచ్చిన జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో సుబ్బారెడ్డిసాగర్, చంద్రబాబు సాగర్ ఆధునికీకరణ పనులు జరగక రైతులకు నీరు అందడం లేదు. అధికారంలోకి రాగానే సమస్యల్నీ పరిష్కరిస్తాం.

త్యాగశీలి పవన్‌కల్యాణ్

జగ్గంపేట అభ్యర్థి జ్యోతుల నెహ్రూ

విజన్ ఉన్న చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తారనే నమ్మకంతో ఉమ్మడిగా ఆయన్ను సీఎం చేయడానికి మూడు పార్టీల మద్దతు ఉంది. తనకున్న బలాన్ని తగ్గించుకున్న వ్యక్తి పవన్‌కల్యాణ్. సంక్షేమం, అభివృద్ధి అందించడం కోసం ఒక త్యాగశీలిగా నిలిచారు. పవన్‌కల్యాణ్‌ను అఖండ మెజార్టీతో గెలిపించుకోవాలి. నియోజకవర్గ అభివృద్ధికి ఎన్నో ప్రాజెక్టులు తీసుకువచ్చి వ్యవసాయంతో పాటు నాణ్యమైన విద్య, వైద్యం అందిస్తాను. పొలాలకు సాగునీటి కొరత లేకుండా చేసి సస్యశ్యామలం చేస్తా.





డిగ్రీలు చదువుకుని.. పొట్ట చేతపట్టుకుని..!

నిరుద్యోగుల జీవితాలతో ఐదేళ్లూ జగన్ ఆటలు

- జాబ్ క్యాలెండర్‌పై మాట తప్పారు
- విడుదలకాని నోటిఫికేషన్లు
- ఐదేళ్లూ సర్కారీ కొలువుల్లేవ్
- మెగా డీఎస్సీ పేరుతో వంచన
- పరిశ్రమలు పడక..75 శాతం ఉద్యోగాల్లేవ్
- వలంటీర్ 'సేవ'ను ఉద్యోగాలుగా బడాయి
- ఇంజనీరింగ్ చదివి ఇంట్లోనే కాలక్షేపం
- వైసీపీ పాలనలో యువతకు దగా
- 20 లక్షల ఉద్యోగాలంటూ కూటమి వరం

'డిగ్రీలు పుచ్చుకొని.. పొట్ట చేతపట్టుకుని' ఈ మాటలు ఎక్కడో విన్నట్టు ఉన్నాయి కదూ.. ఆకలిరాజ్యం సినిమాలోని సూపర్‌హిట్ పాటలో ఒక లైన్ ఇది.. ఈ ఐదేళ్లు జగన్ ప్రభు త్వం ఈ మాటను నిజం చేసింది.. యువతకు ఉద్యోగాల్లేవ్.. చిన్నా చితక ఉద్యోగాలు తప్ప చదువుకు తగిన ఉద్యోగాల ఊసేలేదు.. జగన్ ప్రభుత్వంలో యువత దగా పడ్డారు. జాబ్ క్యాలెండర్ అంటూ గత ఎన్నికల సందర్భంగా జగన్ డాబు కబుర్లు చెప్పారు. వాటిని నమ్మిన యువత నోటిఫికేషన్లకు ఎదురు చూపులతోనే ఐదేళ్లు ఆవిరైపోయాయి. వారి వయసుకు ఐదేళ్లు జమయిపోయింది.

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వంలో యువత ఆశలు నీరుగారిపోగా.. నిరుద్యోగం కోరలు చాచింది. డిగ్రీలు చదివి ఇంట్లో ఉండిపోయిన పిల్లలను చూస్తూ తల్లిదండ్రులు ఆవేదనకు గురయ్యారు. జగన్ సీఎం పీఠమెక్కిన తర్వాత సర్కారీ కొలువులకు ఒక్క నోటిఫికేషన్ ఇవ్వలేదు. వలంటీర్ల 'సేవ'ను ఉద్యోగాల జాబితాలో కలిపేసుకుని లక్షల ఉద్యోగాలు ఇచ్చామంటూ ఐదేళ్లు కాలక్షేపం చేసేశారు. జాబ్ మేళాలంటూ యువతను వంచన చేశారు. మెగా డీఎస్సీ పేరుతో 'గాలి' ప్రకటన తెరపైకి తెచ్చి యువతను మరింత మనోవేదనలో ముంచేశారు. ఐదేళ్ల పాటు యువతను వేధించిన సీఎంగా జగన్ మరో ఘనత సాధించారు.కూటమి 20 లక్షల ఉద్యోగాలిస్తామని చెప్పడంతో యువతలో నూతనోత్సాహం కనిపిస్తోంది.గత చంద్రబాబు హయాంలో పెద్ద సంఖ్యలో ఉపాధి పొందిన చరిత్రను ఉద్యోగార్థులు గుర్తు చేసుకుంటున్నారు.

మెగా డీఎస్సీ .. 390 ఉద్యోగాలు..

ఐదేళ్లుగా ఎప్పుడెప్పుడా అని యువత ఎదురు చూసిన డీఎస్సీ నోటిఫికేషన్ ఎన్నికల ఎత్తులో భాగంగా పరుగు పరుగున వచ్చేసి మెగా పేరుతో భావి ఉపాధ్యాయులను దగా చేసింది. ఖాళీలు బ్లాక్ బోర్డంత ఉండగా భర్తీల సంఖ్య మాత్రం చాకపీసంత కూడా లేదు. ఎన్నికల వేళ ఓ నోటిఫికేషన్‌ను హడావుడిగా తెరపైకి తీసుకొచ్చి యువతను మోసం చేశారు. గత ఎన్నికల ముందు ఓట్ల కోసం మెగా డీఎస్సీ అని ఊదరగొట్టిన జగన్‌కి మళ్లీ ఎన్నికల సమయానికి గానీ ఉద్యోగార్థుల ఆవేదన వినిపించలేదు. ఉమ్మడి తూర్పుగోదావరిని పరిగణనలోకి తీసుకొని డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చారు. కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లో సుమారు 2 వేలపైనే ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలు ఉన్నాయి.జగన్ ప్రభుత్వం మెగా డీఎస్సీ పేరుతో కేవలం 390 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఎన్నికల షెడ్యూల్‌కి నెలముందు ప్రభుత్వం డీఎస్సీని ప్రకటించింది. ఉపాధ్యాయ అర్హత పరీక్షకు 20 రోజులు సమయం ఇచ్చి తర్వాత 10 రోజులకే డీఎస్సీ అన్నారు.అంత తక్కువ సమయంలో అభ్యర్థులు రెం డింటికీ ఎలా సన్నద్ధమవుతారని పాలకులు ఆలోచించలేదు. ఒక పక్క పోస్టులు తక్కు వగా ఉండడం..మరో పక్క పరీక్షల షెడ్యూల్‌తో ఉద్యోగార్థులను జగన్ టార్చర్ పెట్టారనడంలో సందేహం లేదు. కొందరు అభ్యర్థులు తమ ఆవే దన చెబుతూ సోషల్ మీడియాలో పోస్టులు కంటనీరు పెట్టించాయి.

జగన్ మార్కు మెలిక

డీఎస్సీ నోటిఫికేషన్‌లోనూ జగన్ మార్కు మెలిక తప్పలేదు. కీలకమైన సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్‌జీటీ) పోస్టులకు బీఈడీ అభ్యర్థులను అర్హులుగా ప్రకటించి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ప్రక్రియ జాప్యం చేయా లనే పన్నాగం పన్నింది. ఎస్జీటీ పోస్టులకు బీఈడీ అభ్యర్థులు అనర్హులని గతంలో సుప్రీంకోర్టు చెప్పింది. జగన్ ప్రభుత్వం ఎస్జీటీ పోస్టులకు బీఈడీ వాళ్లను అర్హులుగా ప్రకటిస్తూ నోటిఫికేషన్ ఇచ్చేసింది. హైకోర్టు మొట్టికాయలతో ఎస్జీటీ పోస్టులకు డీఎడ్ వారిని మాత్రమే అనుమతిస్తామని తెలిపింది.దాంతో ఎస్జీటీ పోస్టుల దరఖాస్తుదారుల పరిస్థితి అయోమయంలో పడింది.

ఉన్నత చదువులు..చిన్న ఉద్యోగమా?

సచివాలయ ఉద్యోగాల పేరుతోను యువతను జగన్ సర్కారు మోసం చేసింది.. ప్రభుత్వ ఉద్యోగమంటూ ప్రచారం చేసింది..పెద్ద పెద్ద చదువులు చదివిని యువత తమ ఉద్యోగాలు మానివేసి సచివాలయ ఉద్యోగాల బాటపట్టారు. ఇప్పుడు ఉండలేక.వచ్చేది సరిపోక.బయటకు వెళ్లలేక సతమతమవుతున్నారు.చంద్రబాబు వస్తే తమకు మంచి దారి చూపుతారని ఎదురుచూస్తున్నారు. వలంటీర్ల వ్యవస్థతో మరి కొంత మంది యువత ఆటలాడుకున్నారు.ఏదో చిన్న ఉద్యోగం ఇచ్చి గ్రామాలకే కట్టిపడేశారు. వలంటీర్లు చేసేది సేవ అని జగన్ పలుమార్లు అన్నారు. యువత జీవితంలో ఐదేళ్లూ ఎంత విలువైనదో సీఎం సారుకు తెలియదా పాపం.. కేవలం రూ.5వేలు గౌరవభృతి మాత్రమే ఇచ్చి రాజకీయ అవసరాలకు ఉపయోగించుకోడానికి వలంటీరు వ్యవస్థను తెరపైకి తెచ్చారు.వారితో 'అన్ని' పనులూ చేయించుకున్నారు. చివరికి వారిని అడకత్తెరలో వలంటీరు మాదిరిగా చేసేశారు. ఎన్నికలు వచ్చే సరికి తీసి పక్కన పెట్టేశారు.ఇలా లక్షలాది ఉద్యోగాలు కల్పించామంటూ అంకెల గారడీతో నాలిక మడత పెట్టేశారు జగన్.

చంద్రబాబు వస్తే ఐటీ వస్తోంది..!



నేడు మనం చూస్తున్న హైదరాబాద్‌లోని హైటెక్ సిటీ చంద్రబాబు విజన్‌కి ప్రతి రూపం. వేలాది మంది ఐటీ చదివిన పిల్లల కలల సాకారానికి నిదర్శనం. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రజా వేదికతో మొదలు పెట్టిన విధ్వంసం అమరావతి వరకూ నిరంతరాయంగా కొనసాగింది. 2019లో చంద్రబాబు సీఎం అయి ఉంటే రాష్ట్రానికి చెందిన ఐటీ పిల్లలు వేరే రాష్ట్రాలకు కేవలం రూ.10వేల జీతానికి వలస వెళ్లాల్సిన పరిస్థితి దాపురించేది కాదు. మనకు దగ్గరలోని అమరావతిలో ఉద్యోగం చేసుకునేవాళ్లు. విభజిత రాష్ట్రంలో జగన్ ఐటీ పిల్లల ఉపాధికి ఒక్క ప్రయత్నమూ చేయలేదు. ఏపీలో ఐటీ కొలువు కలగానే మిగిలిపోయింది. దీంతో బెంగళూరు, మద్రాసు, హైదరాబాద్‌కి పిల్లలు వలస వెళ్లక తప్పడం లేదు. ఇప్పుడు మళ్లీ ఐటీ హబ్ అంటూ జగన్ ఊదరగొడుతున్నారు.చంద్రబాబును రాజమండ్రి సెంట్రల్ జైలులో బంధించిన సమయంలో ఐటీ ఉద్యోగులు భారీగా వచ్చారు.వాళ్లనూ వైసీపీ ప్రభుత్వం నిస్సిగ్గుగా అడ్డుకొంది.మలేషియాలో ఐటీ ఉద్యోగం చేస్తున్న ఓ ఉద్యోగి రూ.2లక్షలు ఖర్చు పెట్టుకొని చంద్రబాబును చూడాలని ఆనాడు రాజమండ్రి వచ్చారు.ఇదొక్క ఘటన చాలు చంద్రబాబు విజన్ గురించి చెప్పడానికి. మళ్లీ చంద్ర బాబు వస్తే అమరావతిలో హైటెక్ సిటీ వస్తుందని యువత భరోసాగా ఉండడమే ఆ నమ్మకానికి నిదర్శనంగా నిలుస్తోంది.

స్థానికులకు 75 శాతం ఉద్యోగాలేవి..

జగన్ ప్రభుత్వం వచ్చాక మద్యం పరిశ్రమలను బలవంతంగా వైసీపీ నాయకులు చెరబట్టి వ్యాపారం చేస్తున్నారు. అవి తప్ప కొత్తగా పరిశ్రమలు వచ్చిన దాఖలాలు లేవు. ఐదేళ్లలో యువతకు ఉపాధి కల్పించే విధంగా ఒక్క పరిశ్రమ ఉత్పత్తి ప్రారంభించలేదు. వైసీపీ ప్రభుత్వ విధానాలతో చాలా పరిశ్రమలు పడకేశాయి. ఒక్క తూర్పుగోదావరి జిల్లాలోనే చూస్తే సుమా రు 10 పరిశ్రమల వరకూ మూతపడ్డాయి. విజ్జేశ్వరం పవర్ ప్లాంట్, వేమగిరిలో జీవీకే, బిక్కవోలు మండలం కానేరులో బ్లూక్రాఫ్ట్ ఆగ్రో ఇండస్ట్రీస్,జీడిపప్పు, సగ్గుబియ్యం పరిశ్రమలు సైతం మూతపడ్డాయి. కాకినాడ, కోనసీమ జిల్లాలో మరిన్ని పరిశ్రమలు సైతం లాకౌట్‌కు గురయ్యాయి.దీంతో సుమారు 50 వేల మంది ఉపాధి కోల్పోయి రోడ్డునపడ్డారు. ఉమ్మడి తూర్పు లో మూడు నాలుగు పరిశ్రమలకు కొబ్బరికాయలు కొట్టినా అంతకుమించి ఒక్క అడుగూ ముందుకు పడలేదు. రాజా నగరం నియోజకవర్గం పరిధిలో ఎన్నికల షెడ్యూల్‌కి ఒక్క రోజు ముందు హడావుడిగా పారిశ్రామికవాడకు శంకుస్థాపన చేశారు.ఈ ఐదేళ్లలో గుర్తుకురాని పరిశ్రమలు, యువతకు ఉపాధి పాలన చివరలో జగన్‌కి టక్కున గుర్తొచ్చేశాయి.ఏడాదికి వేలాది మంది ఇంజనీరింగ్, బీఎస్సీ, బీఏ, బీబీఎం, బీకాం వంటి డిగ్రీలు పూర్తి చేసి కళాశాలల నుంచి బయటకు వస్తున్నారు. ఐదేళ్లుగా ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు లేక ఇంట్లో కాలక్షేపం చేయక తప్పలేదు.గత ఎన్నికల్లో భాగంగా స్థానిక పరిశ్రమల్లో 75 శాతం ఉద్యోగాలు స్థానికులకే అనే జగన్ హామీని అటకెక్కించారు. అటు ఉద్యోగాల కల్పన లేక.ఇటు పరిశ్రమలు మూతప డడంతో యువత అల్లాడిపోయారు. కొందరు సెల్ ఫోను షాపులు, షాపింగ్ మాల్స్, ఆటోమొబైల్ తదితర దుకాణాల్లో అతి తక్కువ జీతానికి విధిలేక పనిచేస్తున్నారు.

కూటమితో ఊతం

గత ఎన్నికల్లో జగన్ ఇచ్చిన హామీలు 'గాలి' మాటలు కావడంతో పెద్ద సంఖ్యలో యువత కుదేలయ్యారు. నోటిఫికేషన్లకు ఎదురు చూడడంతోనే ఐదేళ్ల గడచిపోయాయి. ఇక జగన్ మాటలు నమ్మే స్థితిలో యువత లేదు. ఇప్పుడు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి తాము అధికారంలోకి వస్తే 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామంటూ భరోసా ఇవ్వడంతో యువతలో మళ్లీ నూతనోత్సాహం కనిపిస్తోంది. చంద్రబాబు హయాంలో పెద్ద సంఖ్యలో వచ్చిన ఉద్యోగాలను వారు గుర్తు చేసుకుంటున్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక నైపుణ్య శిక్షణ పడకేసింది. నోటిఫికేషను ముఖం చాటేసింది. విదేశాల్లో ఉపాధి ఊసే మరిచిపోయారు.



ఇంటర్వ్యూ

పూర్వవైభవం తెస్తా..

- స్మార్ట్‌సిటీ అభివృద్ధే ధ్యేయం
- ప్రచారంలో దూసుకెళుతున్నాం
- కూటమి నేతల పూర్తి సహకారం ఉంది
- కాకినాడ సిటీ అసెంబ్లీ కూటమి అభ్యర్థి వనమాడి కొండబాబు

- 7లో

నాయకులు వస్తున్నారు..

అంబాజీపేటలో నేడు జగన్ సభ - 6లో

నేడు, రేపు పిఠాపురంలో పవన్ రోడ్‌షో - 6లో

నేడు, రేపు షర్మిల టూర్ - 8లో

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎన్నికల ప్రచార జోరు ఊపందుకుంది. అధినేతలంతా తరచూ గోదావరి జిల్లాలో వాలిపోతున్నారు. ఇక్కడ గెలుపే ప్రధానం కావడంతో అన్ని పార్టీల అధినేతలూ సభలకు విచ్చేస్తున్నారు. సోమ, మంగళవారాల్లో పవన్ తన సొంత నియోజకవర్గమైన పిఠాపురంలో రోడ్‌షో నిర్వహిస్తారు. సోమవారం మధ్యాహ్నం సీఎం జగన్ అంబాజీపేటలో జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు. సోమవారం కాకినాడ, రాజమహేంద్రవరంలలో పీసీసీ అధ్యక్షురాలు షర్మిల పర్యటించి ఎన్నికల సభల్లోను, మంగళవారం అంబాజీపేటలోను పాల్గొంటారు.

పిగన్నవరం/ రావులపాలెం/ ఆత్రేయపురం/ మండపేట/గండేపల్లి

నిరుద్యోగుల ఆవేదన..ఆక్రందన

ఈ ఐదేళ్ల వైసీపీ పాలన.. యువత జీవితాలతో ఆటలాడింది. గత ఎన్నికలకు ముందు ఎన్నో హామీలు ఇచ్చి ఏ ఒక్కటీ అమలుచేయలేదు. వలంటీర్లు, సచివాలయ సిబ్బందిని నియమించి.. ఇవే ఉద్యోగాలంటూ మభ్యపెట్టే ప్రయత్నం చేసింది. ఐదేళ్లపాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకుండా పోవడం అంటే వారి జీవితంలో యువత ఎదిగే క్రమం ఆగిపోయినట్టే. కాలాన్ని తిరిగి తేలేనట్టే.. వారి భవిష్యత్తునూ తీరని అన్యాయం జరిగినట్టే. వారి మాటల్లోనే

డిగ్రీ చదివి ఫ్రూట్స్ అమ్ముతున్నా



ఒక్క చాన్స్ అంటూ అధికారం చేపట్టిన సీఎం జగన్ ఈ ఐదేళ్లలో ఉద్యోగాలు కల్పించలేదు. ప్రైవేటు ఉద్యోగం చేసుకుందామన్నా పరిశ్రమలు తీసుకురాలేదు. దీంతో చాలామంది యువత రోడ్ల మీద తిరుగుతున్నారు. టీడీపీ హయాంలో ఇచ్చిన ఉద్యోగాలు ఇప్పుడు కరువయ్యాయి. ఉద్యోగం లేక ఫ్రూట్స్ అమ్ముకుంటున్నా. చింతల స్వామి, మల్లేపల్లి, గండేపల్లి మండలం

చివరికి నిరాశే మిగిలింది..



అధికారంలోకి వస్తే ప్రతి ఏడాది మెగా డీఎస్సీలు నిర్వహించి నిరుద్యోగుల సమస్యను పరిష్కరిస్తానని ఆనాటి పాదయాత్రలో చెప్పిన సీఎం జగన్ ఐదేళ్ల కాలంలో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించలేదు. ఎంతగానో ఎదురుచూసిన నిరుద్యోగుల ఆశలు నిరాశగానే మిగిలిపోయాయి. కుటుంబ సభ్యులకు దూరంగా ఉండి ఏళ్ల తరబడి కోచింగ్ తీసుకున్నాం. కోచింగ్ సెంటర్లలో కోచింగ్ నిమిత్తం లక్షలాది రూపాయలు హెచ్చించాం. తీరా చూస్తే జగన్ ప్రభుత్వం బీఈడీ అభ్యర్థులకు మొండిచెయ్యి చూపింది. ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించాలన్న నా కల జగన్ ప్రభుత్వంలో నెరవేరలేదు. చాలా బాధగా ఉంది. **– కుడిపూడి శ్యామలాదేవి, మానేపల్లి, పి.గన్నవరం మండలం**

డీఎస్సీ లేక నష్టపోయాం



2014లో ఎంఎస్సీ బీఈడీ పూర్తిచేసుకుని అప్పట్లో విడుదల చేసిన డీఎస్సీ పరీక్షలు రాశాం. కాకపోతే ఉత్తీర్ణత కాలేకపోయాం. 2019 నుంచి నేటి వరకూ డీఎస్సీపై స్పష్టతలేదు. ఇటీవల విడుదల చేసిన నోటిఫికేషన్ పరీక్షలు రాశాం. వాటి ఫలితాలు విడుదల చేయ్యలేదు. డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలలో అలసత్వం కారణంగా బీఈడీ పూర్తిచేసికున్నప్పటికి ఉద్యోగాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. చదువుకుని కూడా ఉద్యోగం లేక ఖాళీగా ఉంటున్నాం. సకాలంలో ఉద్యోగాల భర్తీ జరగాలి. **– డి.చైతన్య, రావులపాలెం**

20 లక్షల ఉద్యోగాలపైనే ఆశ



నాపేరు చందు.. గ్రాడ్యూషన్ చేశాను. ఇప్పటివరకు ఎటువంటి ఉద్యోగం రాలేదు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఉద్యోగాల కల్పన జరగలేదు. కేవలం వలంటీర్లు, సచివాలయ ఉద్యోగాలు తప్ప ప్రభుత్వ ఉద్యోగాలేవీ లేవు. ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేక ఇబ్బంది పడుతున్నాం. ఇప్పటివరకు రాజధాని లేకపోవడం, పరిశ్రమలు రాకపోవడంతో ఎంతో నష్టం జరిగింది. చదువున్న ఐటీ సెక్టార్‌లో ఉద్యోగాలు లేవు. దాంతో చదువుకున్నా ఇంటికే పరిమితం అవుతున్నాం. కూటమి ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పడంపైనే ఆశలు పెట్టుకున్నాం. వచ్చే ప్రభుత్వంలోనైనా మా కలలు సాకారం అవుతాయని ఆశిస్తున్నాం. **– చందు, అచ్యుతాపురం, కపిలేశ్వరపురం మండలం**

పక్క రాష్ట్రాలకు పట్టభద్రులు



జగన్ ఐదేళ్లలో ఐటీ రంగాన్ని పూర్తిగా విస్మరించారు. ఇంజనీరింగ్ పట్టభద్రులు, ఉపాధి కోసం పక్క రాష్ట్రాలకు పరుగులు పెట్టాల్సిన దుస్థితి ఏర్పడింది. కోటి ఆశలతో కష్టపడి ఇంజనీరింగ్ పూర్తిచేసుకున్న పట్టభద్రులకు రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు కనుమరగయ్యాయి. బీటెక్, కంప్యూటర్ ఇంజనీరింగ్, ఈఈఈ, మెకానిక్ ఇంజనీరింగ్ పూర్తిచేసిన ఎంతోమంది పట్టభద్రులు మన రాష్ట్రంలో ఉపాధిలేక పక్క రాష్ట్రాలో విస్తరించిన కంపెనీల వైపు వెళ్లాల్సిన దుస్థితి రాష్ట్రంలో ఏర్పడడం దౌర్భాగ్యం. **కన్నా సాయిరాం, బీటెక్ విద్యార్థి, రాజవరం, ఆత్రేయపురం**



బీ ఫారం అంటే ఏమిటంటే..

సామర్లకోట, ఏప్రిల్ 28: ఏ ఫారం, బీ ఫారం అనే పదాలు ఎన్నికల సమయంలో తరచూ వింటుంటాం. గుర్తింపు పొందిన ప్రాంతీయ, జాతీయ పార్టీలు తమ పార్టీ నుంచి పోటీ చేసే అభ్యర్థులకు బీ ఫారం ఇస్తాయి. అంటే ఫలానా నియోజకవర్గం నుంచి తమ పార్టీ తరఫున పోటీచేసే అభ్యర్థి ఇతనే అని ఇచ్చే ధ్రువీకరణ పత్రమే ఇది. ఈ ఫారాన్ని పార్టీ అధ్యక్షుడు కానీ, ఆ పార్టీకి చెందిన ప్రత్యేక ప్రతినిధి కానీ జారీ చేస్తారు. నామినేషన్ వేసే సమయంలో రిటర్నింగ్ అధికారికి బీ ఫారం దాఖలు చేయాల్సి ఉంటుంది. ఇలా సమర్పించిన అభ్యర్థులకే ఎన్నికల కమిషన్ ఆ పార్టీ గుర్తును కేటాయిస్తుంది. లేకపోతే స్వతంత్ర అభ్యర్థిగా పరిగణిస్తుంది. బీ ఫారం ఇచ్చే అధికారాన్ని అప్పగిస్తూ ఇచ్చేదే ఏ ఫారం. దీనిని తీసుకున్న వ్యక్తి అభ్యర్థులకు బీ ఫారం ఇచ్చే అధికారం ఉంటుంది.





ఇద్దరూ అయితాబత్తుల ఆనందరావులే

అయితాబత్తుల వారు ఐదుగురు

అమలాపురం టౌన్, ఏప్రిల్ 28: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం ఎస్సీ రిజర్వుడు అసెంబ్లీ స్థానానికి నామినేషన్ల పరిశీలన అనంతరం 18 మంది అభ్యర్థులు మిగిలారు. అందులో ఐదుగురు అయితాబత్తుల వారే ఉన్నారు. వారిలో ఇద్దరు అయితాబత్తుల ఆనందరావులు ఉండడం విశేషం. ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాం గ్రామానికి చెందిన అయితాబత్తుల ఆనందరావు కూటమి తరఫున టీడీపీ అభ్యర్థిగా బరిలో నిలిచారు. అదే గ్రామానికి చెందిన అయితాబత్తుల అభిమన్యుడు జాతీయ జనసేన పార్టీ తరఫున పోటీపడుతున్నారు. కపిలేశ్వరపురం మండలం అద్దంకివారిలంకకు చెందిన మరో అయితాబత్తుల ఆనందరావు స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచారు. ఇక నవరంగ్ కాంగ్రెస్ పార్టీ తరఫున అల్లవరం మండలం దేవగుప్తం గ్రామానికి చెందిన అయితాబత్తుల ఆనందబాబు పోటీ పడుతున్నారు. జాతీయ కాంగ్రెస్ పార్టీ తరఫున అయితాబత్తుల సుభాషిణి బరిలో నిలిచారు.

రెచ్చగొట్టే వ్యాఖ్యలతో జైలే

పెద్దాపురం, ఏప్రిల్ 28 : కొందరు అభ్యర్థులు సెంటిమెంట్‌ను రెచ్చగొడితేనో ఓట్లు పడతాయని భావించి కులం, వర్గం, ప్రాంతం పేరుతో ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారు. ఇటువంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలకు అడ్డుకట్ట వేసేందుకు ఎన్నికల సంఘం నియమావళిలో కఠిన నిబంధనలు రూపొందించింది. ఎన్నికల్లో ఎవరైనా జాతి, మతం, కుల, భాష, సమాజం పేరుతో రెచ్చగొడితే ఆర్‌పీ చట్టం 1951 సెక్షన్ 125, ఐపీసీ సెక్షన్ 153ఏ ప్రకారం మూడేళ్ల జైలుశిక్ష, జరిమానా విధిస్తారు. ఓటు కోసం మద్యం, డబ్బులు, ఇతర వస్తువులను తీసుకున్నవారిని నేరస్థులుగానే పరిగణిస్తారు. ఐపీసీ సెక్షన్ 171బీ, 171ఈ, హెచ్ ప్రకారం లంచంగా పరిగణించి ఏడాది జైలు శిక్ష విధిస్తారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో డబ్బు, మద్యం ప్రవాహంపై నిఘా పెంచారు. నజరానాలకు లొంగినా, ఓటర్లను ప్రలోభాలకు గురిచేసినా భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు.

రేపు షర్మిల రాక

అంబాజీపేట, ఏప్రిల్ 28: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి 30వ తేదీన అంబాజీపేట నాలుగురోడ్ల జంక్షన్‌లో నిర్వహించే సభలో పాల్గొంటారని కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, లోక్‌సభ అభ్యర్థి జంగా గౌతమ్ తెలిపారు. అంబాజీపేటలో మండల కార్యదర్శి ఆదుర్తి నారాయణమూర్తి స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో గౌతమ్ మాట్లాడారు. రాష్ట్రంలో దళితులపై అనేక దాడులు జరిగాయని, అయినప్పటికి దళితులపై కపటప్రేమ ఉన్నట్లు నటిస్తూ దళిత ఓట్ల కోసం పాకులాడుతున్నారన్నారు. దళితుల శిరోముండనం కేసులో శిక్షపడిన తోట త్రిమూర్తులకు టిక్కెట్టు ఇచ్చి దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారన్నారు. సమావేశంలో కొండేటి వెంకటేశ్వరరావు, మహ్మద్ ఆరీఫ్, మాచవరపు శివన్నారాయణ, నెల్లి వెంకటరమణ, నాగవరపు నాగరాజు, నేతల నాగరాజు, ములపర్తి మోహనరావు, వాకపల్లి రాంబాబు, అంబటి శ్రీను, యార్లగడ్డ రవీంద్ర, సీపీఎం నాయకుడు పితాని ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

నాయకులొస్తున్నారు..

అంబాజీపేటలో నేడు జగన్ సభ

అంబాజీపేట, ఏప్రిల్ 28: అంబాజీపేట సెంటర్‌లో సోమవారం మధ్యాహ్నం 12.30 గంటలకు సీఎం జగన్ మోహన్‌రెడ్డి బహిరంగ సభ జరగనుంది. దీంతో ఎస్పీ ఎస్.శ్రీధర్, అడిషనల్ ఎస్పీ ఖాదర్‌బాషా, పి.గన్నవరం వైసీపీ అసెంబ్లీ అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు ఏర్పాట్లను ఆదివారం పరిశీలించారు. అంబాజీపేట హైస్కూల్‌లో హెలిప్యాడ్ ఏర్పాటు చేశారు. పలు ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నట్లు డీఎస్పీ కె.వెంకటరమణ తెలిపారు. మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి, చెల్లబోయిన శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షుడు విత్తనాల శేఖర్, జేసీఎస్ కన్వీనర్ దొమ్మేటి సత్యమోహన్ తదితరులు ఉన్నారు.


నేడు, రేపు పవన్ రోడ్‌షో

పిఠాపురం, ఏప్రిల్ 28: పిఠాపురం నియోజకవర్గంలో సోమ, మంగళవారాల్లో జనసేన అధినేత పవన్ కల్యాణ్ రోడ్‌షో నిర్వహించనున్నారని జనసేన పిఠాపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ మర్రెడ్డి శ్రీనివాస్ తెలిపారు. గొల్లప్రోలు మండలం చెందుర్తిలో సోమవారం ఉదయం 8 గంటలకు రోడ్‌షో ప్రారంభమై వన్నెపూడి, కొడవలి, వెల్దుర్తి, పి.దొంతమూరు, బి.కొత్తూరు, పి.తిమ్మాపురం, గోకివాడ, జములపల్లి, నరసింగపురం, ఎల్ఎస్‌పురం, కోలంక, విరవాడ, విరవ, మల్లాం, మంగితుర్తి, జల్లూరు, ఎఫ్‌కేపాలెం, కందరాడ గ్రామాల మీదుగా కుమారపురం వరకూ సాగుతుందని చెప్పారు. మంగళవారం ఉదయం 9 గంటలకు చిత్రాడలో ప్రారంభమై గొల్లప్రోలు పట్టణ వీధుల్లో రోడ్‌షో జరుగుతుందని తెలిపారు.



28 ఏళ్లు పూర్తయింది..

పెద్దాపురం, ఏప్రిల్ 28: ఓటు వేయడానికి ప్రధాన ఆయుధమైన ఓటరు గుర్తింపు కార్డు అమల్లోకి వచ్చి 28 ఏళ్లు పూర్తవుతోంది. ఎన్నికల్లో పారదర్శకత పెంచేందుకు భారత ఎన్నికల సంఘం ఎప్పటికప్పుడు సంస్కరణలు అమలు చేస్తూనే ఉంది. ఈ మేరకు 1995లో అప్పటి ఎన్నికల కమిషనర్ టీఎన్ శేషన్ ఓటరు గుర్తింపు కార్డులు ప్రవేశపెట్టారు. ఇవి అమలులోకి వచ్చి 28 ఏళ్లు అవుతోంది. ఓటరు జాబితా ఆధారంగా పుట్టిన తేదీ, ఫోటో, చిరునామా, తదితర వివరాలతో ఎన్నికల కమిషన్ ఓటరు గుర్తింపు ముద్రిస్తుంది. ప్రతీ కార్డుపై హాలోగ్రామ్, స్టిక్కర్ ఉంటంది. ఓటరు గుర్తింపు కార్డు ఆధారంగా ఓటు, పోలింగ్ బూత్ వివరాలు తెలుసుకోవచ్చు. ఓటరు గుర్తింపు కార్డు చూపించి ఓటు వేయవచ్చు. బ్యాంకు ఖాతాలు, రుణాలు, డ్రైవింగ్ లైసెన్సు, తదితర ఇతర అవసరాలకు కోసం గుర్తింపు కార్డుగా కూడా వినియోగించుకోవచ్చు.







బొజ్జా అప్పలస్వామి, కుడుపూడి సూర్యనారాయణ, కుడుపూడి ప్రభాకరరావు, మెట్ల సత్యనారాయణ, నడింపల్లి రామభద్రరాజు, కుడుపూడి చిట్టబ్బాయి, పినిపే విశ్వరూప్, కళా వెంకట్రావు, అయితాబత్తుల ఆనందరావు

సామాజికవర్గాల సమీకరణలతో జరిగే ఎన్నికల పోరులో కోనసీమ కేంద్రమైన అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ ఓటర్లు ఇచ్చే తీర్పు విలక్షణమైనది. ఆరు దశాబ్దాల కాలంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రెండు సామాజిక వర్గాలకు చెందిన వ్యక్తుల ఏలుబడిలోనే నియోజకవర్గ పాలన సాగింది. రాజకీయాలతో హోరాహోరీగా ఎన్నికలు జరిగే ప్రాంతాలకు భిన్నంగా కుల సమీకరణాలతోనే ఈ నియోజకవర్గంలో ఎన్నికల ఫలితాలు ఆధారపడి ఉంటాయి. ఉమ్మడి మద్రాసు రాష్ట్ర ప్రభుత్వంలోనే కోనసీమకు చెందిన కళా వెంకట్రావు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ మంత్రివర్గంలో కీలక భూమిక వహించి అప్పట్లోనే ఈ ప్రాంత అభివృద్ధికి ఎనలేని కృషి చేసిన మహా మనిషి. రాజకీయ పార్టీల ప్రభంజనంలో సైతం అయిదు పర్యాయాలు ఇక్కడ స్వతంత్ర అభ్యర్థులే విజయం సాధించారు. నాలుగు పర్యాయాలు కుడుపూడి ప్రభాకరరావు, మూడు పర్యాయాలు మెట్ల సత్యనారాయణరావు ఈ నియోజకవర్గం నుంచి ప్రాతినిత్యం వహించారు. 1955 ఎన్నికల్లో ఎస్సీలకు రిజర్వు అయిన ఈ స్థానం 1962 నుంచి జనరల్ నియోజకవర్గంగా మారింది. పునర్విభజన అనంతరం 2009లో తిరిగి ఎస్సీలకు రిజర్వు అయ్యింది. అమలాపురం మున్సిపాలిటీ, అల్లవరం, అమలాపురం రూరల్, ఉప్పలగుప్తం మండలాలతో కలిసి ఈ నియోజకవర్గం ఆవిర్భవించింది. అయినప్పటికీ రెండు ప్రధాన సామాజిక వర్గీయుల ఓట్ల తీర్పు ఆధారంగానే అభ్యర్థి భవితవ్యం ఆధారపడి ఉంటుంది. ఈ నియోజకవర్గ ఓటర్ల అంతరంగం నేతలకు ఎప్పటికీ అంతుపట్టని విషయం..

స్వతంత్రులదే హవా

ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో పరిపాలన సాగే సమయంలో కాకినాడ కేంద్రంగా అమలాపురం అంతర్భాగమై ద్విసభ నియోజకవర్గం ఏర్పడింది. ఉమ్మడి మద్రాసు రాష్ట్ర ప్రభుత్వంలో మంత్రి హోదాలో పనిచేసిన కళా వెంకట్రావు కాంగ్రెస్ అభ్యర్థిగా 1952లో జరిగిన ఎన్నికల్లో కిసాన్ మజ్దూర్ ప్రజా పార్టీ తరఫున పోటీ చేసిన నడింపల్లి రామభద్రరాజు చేతిలో పరాజయం పొందారు. అప్పట్లోనే షెడ్యూల్డు కులాల సమాఖ్య పేరిట ఎన్నికల బరిలోకి దిగిన బొజ్జా అప్పలస్వామి తన సమీప కాంగ్రెస్ ప్రత్యర్థి పి.లక్ష్మణస్వామిపై విజయం సాధించారు. 1955లో అమలాపురం ద్విసభ నియోజకవర్గం నుంచి సీపీఐకి చెందిన జి.నారాయణదాసుపై స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన గుత్తుల నరసింహమూర్తి గెలుపొందారు. సీపీఐకి చెందిన ఎస్ఆర్ రావుపై బొజ్జా అప్పలస్వామి ఇండిపెండెంట్‌గా పోటీ చేసి అప్పట్లో మరోసారి విజయకేతనం ఎగురవేశారు. 1962లో కుడుపూడి సూర్యనారాయణ, 1967లో కుడుపూడి ప్రభాకరరావు వరుసగా స్వతంత్ర అభ్యర్థులుగా బరిలోకి దిగి విజయం సాధించడం విశేషం. స్వతంత్రంగా గెలవడంలో కుడుపూడి వంశీయులకు చరిత్రే ఉంది. తిరిగి 2004లో జరిగిన హోరాహోరీ ఎన్నికల్లో ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన కుడుపూడి చిట్టబ్బాయి ఘన విజయం సాధించడం ద్వారా కుడుపూడి వంశీయులు హ్యాట్రిక్ సాధించి మరోసారి రికార్డులకు ఎక్కారు. అయితే ఈ నియోజకవర్గంలో శెట్టిబలిజ, కాపు సామాజిక వర్గీయుల అభ్యర్థుల మధ్య ప్రధాన పోరు నెలకొంది. ప్రస్తుతం రిజర్వ్‌డ్ నియోజకవర్గమైనా అదే పరిస్థితి కొనసాగుతుంది. 1972లో కుడుపూడి ప్రభాకరరావు రవణం రామచంద్రరావుపైనా, 1978లో పలచోళ్ల వెంకటరామారావు, దొమ్మేటి నాగేశ్వ రరావుపై పోటీ చేసి గెలుపొందారు. 1983లో మెట్ల సత్య నారాయణరావు కుడుపూడి ప్రభాకరరావుపైన, 1985లో కుడుపూడి ప్రభాకరరావు రవణం రామ చంద్రరావుపైనా, 1989లో కుడుపూడి ప్రభాకరరావు మెట్ల సత్యనారాయణరావుపై గెలుపొందారు. 1994, 99లో జరిగిన ఎన్నికల్లో కుడుపూడి ప్రభాకరరావుపై మెట్ల సత్యనారాయణరావు విజయకేతనం ఎగురవేశారు. 2004లో జరిగిన ఎన్నికల్లో కుడుపూడి చిట్టబ్బాయి మెట్ల సత్యనారాయణరావుపై విజయం సాధించారు. అనంతరం 2009లో జరిగిన ఎన్నికల్లో అమలాపురం నియోజకవర్గం పునర్విభజనతో ఎస్సీ వర్గీయులకు రిజర్వు చేయబడింది. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన పినిపే విశ్వరూప్ ప్రజారాజ్యం తరఫున పోటీ చేసిన చింతా కృష్ణమూర్తిపై విజయం సాధించారు. 2014లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి పినిపే విశ్వరూప్‌పై టీడీపీ అభ్యర్థిగా బరిలో దిగిన అయితాబత్తుల ఆనందరావు ఘన విజయం సాధించారు. 2019లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి ఆనందరావుపై త్రిముఖ పోటీలో వైసీపీ అభ్యర్థి పినిపే విశ్వరూప్ విజయం సాధించారు. ఈ నియోజకవర్గం నుంచి ఎన్నికైన ప్రజాప్రతినిధుల్లో రాష్ట్ర మంత్రివర్గంలో కుడుపూడి ప్రభాకరరావు, మెట్ల సత్య నారా యణరావు, పినిపే విశ్వరూప్‌లు మంత్రి పదవులు నిర్వహించారు.

• (అమలాపురం టౌన్)

తీర్పుల్లో సంచలనం

రాజకీయాల జోరు కాదు.. సామాజిక వర్గాల పోరే..!


ఐదు సార్లు స్వతంత్రులదే హవా..

ఏ ఎన్నికలైనా రెండు సామాజికవర్గాల నేతలదే ఆధిపత్యం


సంవత్సరం	విజేత	పార్టీ
1952)	నడింపల్లి రామభద్రరాజు	కేఎంపీపీ
	బొజ్జా అప్పలస్వామి	
1955	బొజ్జా అప్పలస్వామి	స్వతంత్ర
	గుత్తుల నరసింహమూర్తి	స్వతంత్ర
1962	కుడుపూడి సూర్యనారాయణ	స్వతంత్ర
1967	కుడుపూడి ప్రభాకరరావు	స్వతంత్ర
1972	కుడుపూడి ప్రభాకరరావు	కాంగ్రెస్
1978	పలచోళ్ల వెంకటశ్రీరామారావు	జనతా
1983	మెట్ల సత్యనారాయణరావు	టీడీపీ
1985	కుడుపూడి ప్రభాకరరావు	కాంగ్రెస్
1989	కుడుపూడి ప్రభాకరరావు	కాంగ్రెస్
1994	మెట్ల సత్యనారాయణరావు	టీడీపీ
1999	మెట్ల సత్యనారాయణరావు	టీడీపీ
2004	కుడుపూడి చిట్టబ్బాయి	స్వతంత్ర
2009	పినిపే విశ్వరూప్	కాంగ్రెస్
2014	అయితాబత్తుల ఆనందరావు	టీడీపీ
2019	పినిపేవిశ్వరూప్	వైసీపీ

ఓటర్ల వివరాలు

అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 2,12,593 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో 1,05,863 మంది పురుషులు, 1,06,729 మంది మహిళలు ఉండగా, ఇతరులు ఒకరు ఉన్నారు. నియోజకవర్గంలో 235 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా, వాటిలో 138 సమస్యాత్మక, 35 అతిసమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నట్టు ప్రాథమికంగా అధికారులు గుర్తించారు.







చంద్రబాబు ఆరోగ్య ఉద్యానవనం(ఫైల్)

అభివృద్ధి పనులు ఎప్పటికి పూర్తయ్యేనో..

నియోజకవర్గంలో అమలాపురం రూరల్ మండలం సమనసలో 32.27 ఎకరాల విస్తీర్ణంలో ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణానికి సుమారు మూడేళ్ల క్రితం శంకుస్థాపన చేశారు. రూ.360 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ పనులు నిధుల కొరతతో మందకొడిగా సాగుతున్నాయి. జిల్లా కేంద్రమైన అమలాపురం ఆర్టీసీ బస్టాండు సెంటర్‌ను రూ.5 కోట్ల అంచనా వ్యయంతో ఆధునికీకరించేందుకు శంకుస్థాపన చేశారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అమలాపురం పట్టణంలో చేపట్టిన సుందరీకరణ పనులతో పాటు కోట్లాది రూపాయలతో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టారు. అమలాపురం గడియార స్తంభం సెంటర్ ఆధునికీకరణ, డివైడర్ల ఏర్పాటు వంటి పనులు చేసినప్పటికీ వాటిని సంరక్షించే పరిస్థితులు లేకుండాపోయాయి. ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని చంద్రబాబు ఆరోగ్య ఉద్యానవనం, డాక్టర్ మెట్ల హెల్త్ పార్కులు నిర్మించారు. చంద్రబాబు ఆరోగ్య ఉద్యానవనం పరిస్థితి నేడు అంతకంతకు దిగజారిపోతుంది.



అమలాపురం మార్కెట్ సెంటర్‌లో చెత్తాచెదారంతో నిండిన డ్రైన్

సమస్యలు ఇవే..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రంగా నిలిచిన అమలాపురం పట్టణంతో పాటు నియోజకవర్గంలో ఎన్నో సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి. ప్రగతికి, ఆర్థిక పురోభివృద్ధికి అవసరమైన వనరులు పుష్కలంగా ఉన్నప్పటికీ వాటిని వినియోగించుకోవడంలో వైఫల్యాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కోటిపల్లి వయా అమలాపురం మీదుగా నర్సాపురం వరకు రైల్వేలైన్ నిర్మాణం దశాబ్దాల కాలంగా మందకొడిగా సాగుతోంది. పైగా రైల్వే స్టేషన్, అతిథిగృహాల కోసం కూడా ప్రజాప్రతినిధులు శంకుస్థాపనలు చేసిన శిలాఫలకాలు వారి వైఫల్యాలకు నిలువుటద్దంగా దర్శనమిస్తున్నాయి. అమలాపురం పట్టణంలో వందల కోట్ల పైబడే వ్యయంతో నిర్మించ తలపెట్టిన మంచినీటి ప్రాజెక్టుతో పాటు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పథకం అంచనాలకే పరిమితమయ్యింది. కొబ్బరి ఆధారిత పరిశ్రమలతో పాటు గ్యాస్ ఆధారిత పరిశ్రమల ఏర్పాటు పూర్తిస్థాయిలో ఆచరణ సాధ్యం కావడం లేదు. ప్రధాన రహదారుల వెంబడి ఉన్న ఆక్రమణలతో పాటు డ్రెయిన్లు, మురుగు కాల్వలు, పంట కాల్వలపై ఉన్న ఆక్రమణలు తొలగించడంలో ఉన్న రాజకీయ ప్రతిబంధకాలను అధిగమించి ఆక్రమణల తొలగింపు పనులు చేపట్టాలి. కాల్వల ప్రవాహాలకు ఉన్న ప్రతిబంధకాలను తొలగించడం ద్వారా శివారు ప్రాంతాలకు సైతం సాగునీరు, తాగునీరు అందించవచ్చు. అమలాపురం పట్టణంలో పెరుగుతున్న రద్దీ దృష్ట్యా ట్రాఫిక్ సమస్య నివారించాలి. పట్టణంతో పాటు నియోజకవర్గ పరిధిలోని గ్రామాలకు, శివారు ప్రాంతాలకు మంచినీటి సౌకర్యం విస్తరింపచేయాల్సి ఉంది. కూనవరం, రామేశ్వరంలోని స్ట్రెయిట్ కట్‌లను శాశ్వత ప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టాలి.

ఇంటర్వ్యూ

పూర్వ వైభవం తెస్తా..



- స్మార్ట్‌సిటీ అభివృద్ధే ధ్యేయం
- ప్రచారంలో దూసుకెళుతున్నాం
- అన్ని వర్గాలతోపాటు మహిళలు, యువతలో ఆదరణ
- కూటమి నేతలు, కార్యకర్తలు పూర్తిగా సహకరిస్తున్నారు
- కాకినాడ సిటీ అసెంబ్లీ కూటమి అభ్యర్థి వనమాడి కొండబాబు

ప్ర. ప్రస్తుత ఎన్నికల ప్రచారం ఎలా సాగుతోంది ?
జ. ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. డివిజన్లలో ఇంటింటి ప్రచారం, ప్రధాన ప్రాంతాల్లో ప్రజాగళం సభలతో దూసుకెళుతున్నాం. ఎక్కడికక్కడ ప్రజలు.. ముఖ్యంగా మహిళలు, యువత ఎంతో ఆదరణ చూపుతున్నారు.
ప్ర. ఏ వర్గాల ప్రజలు ఎలా స్పందిస్తున్నారు ?
జ. అన్ని వర్గాల ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోంది. వైసీపీ ఐదేళ్ల పాలనలో పెరిగిన నిత్యావసర ధరలు, కరెంటు చార్జీలు, పన్నులతో అన్ని వర్గాల ప్రజలు విసిగిపోయారు. ఈ అరాచక ప్రభుత్వం పోయి ప్రజా సంక్షేమ, అభివృద్ధి చేసే ప్రభుత్వం రావాలని ఎదురుచూస్తున్నారు.
ప్ర. మీకున్న గెలుపు అవకాశాలేంటి.. ఎందుకంత ధీమా ?
జ. గతంలో నేను చేసిన అభివృద్ధి పనులు, ప్రజల ఆదరాభిమానాలే నన్ను గెలిపిస్తాయి. 2014-19 మధ్య ఐదేళ్లలో సామాజికమైన, వ్యక్తిగతమైనవి రూ.2 వేల కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేశాను. పేదలకోసం 47 ఎకరాల పోర్టు భూములు సేకరించి 4,600 గృహాల నిర్మాణం చేపట్టాం. రూ.4 కోట్లతో రాజీవ్ గృహకల్ప ఫ్లాట్లను మరమ్మతులు చేయించాం. రాబోయే 25 ఏళ్ల అవసరాలకు తాగునీటి సరఫరా ప్రాజెక్టు తెచ్చానని అందరికీ తెలుసు.
ప్ర. ఇక్కడ మెజారిటీ వర్గాల కోసం మీరేమి చేయబోతున్నారు ?
జ. ప్రత్యేకించి ఒక వర్గమని కాదు... అన్ని వర్గాల అభ్యున్నతి కోసం గతం నుంచి పనిచేశాను. కాకినాడకు స్మార్ట్‌సిటీ ప్రాజెక్టు ద్వారా రహదారులు, డ్రెయిన్లు, బ్రిడ్జిల నిర్మాణం, పార్కులు, జిమ్‌లు, మార్కెట్‌ల అభివృద్ధి చేపట్టాం.
ప్ర. గత పాలకుల హయాంలో జరిగిన అన్యాయం ఏంటి?
జ. వైసీపీ ఐదేళ్ల పాలనలో కాకినాడ ప్రజలకు, ప్రజల ఆస్తులకు భద్రత లేకుండాపోయింది. ప్రశాంత కాకినాడ నగరాన్ని గంజాయికి అడ్డాగా మార్చేశారు. గూండాలు, రౌడీల నిలయంగా మార్చివేశారు. ఈ అరాచకాలన్నింటినీ అడుగడుగునా అడ్డుకున్నాం. కాకినాడ ప్రజలకు జరుగుతున్న ప్రతి అన్యాయాన్ని నిలదీశాం. దీంతో సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి టీడీపీ వాళ్ల మీద, తన మీద అక్రమ కేసులు పెట్టించాడు. అయినా పోరాడుతూనే ఉన్నాం.
ప్ర. ప్రజలకు అందుబాటులో ఉండేందుకు ఏం చేయబోతున్నారు ?
జ. 1999-2004, 2014-19 మధ్యకాలంలో రెండుసార్లు ఎమ్మెల్యేగా పనిచేశాను. ఈ పాతికేళ్లలో అన్ని వేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ వచ్చాను. గెలిచినా, ఓడినా ఒకే విధానం అవలంభించా. గెలిస్తే ఊరిలో ఉండడం, ఓడితే ఊరొదిలేసి పోవడం వంటివి నాకు చాతకాదు.
ప్ర. గెలిస్తే నియోజకవర్గంలో ఏ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తారు?
జ. గతంలో నేను చేసిన అభివృద్ధి తప్ప వైసీపీ ఐదేళ్ల పాలనలో కాకినాడలో జరిగిన అభివృద్ధి ఏమీలేదు. నేను ఎమ్మెల్యేగా గెలిచాక కాకినాడ స్మార్ట్ సిటీకి పూర్వ వైభవం తెస్తా. నిలిచిపోయిన పెండింగ్ పనులన్నీ పూర్తి చేయిస్తా. కూటమి ప్రభుత్వంలో కాకినాడ నగరం మరింత అభివృద్ధి చెందడం ఖాయం.
ప్ర. కూటమి పార్టీల సహకారం ఎలా ఉంది?
జ. తెలుగుదేశం కూటమి పార్టీలైన జనసేన, బీజేపీల నాయకులు, కార్యకర్తలు పూర్తి సహకారం అందిస్తున్నారు. నా విజయంకోసం పాటు పడుతున్నారు.
ప్ర. ప్రచారంలో మీ కుటుంబ సభ్యుల సహకారం ఎలా ఉంది ?
జ. ప్రచారంలో నా కుటుంబ సభ్యులు పూర్తి సహకారం అందిస్తున్నారు. నా కుమారులు, నా అన్న కుమారులు ఇంటింట ప్రచారం సాగిస్తున్నారు. కూటమి చేపట్టే సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలను వివరిస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు.
ప్ర. మీ పార్టీ ఎన్నికల హామీలపై జనస్పందన ఏంటి?
జ. టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి హామీలపై ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలు ప్రజలను బాగా ఆకట్టుకున్నాయి. వైసీపీ మేనిఫెస్టో ఇప్పటికే చతికిలపడింది. **- కాకినాడ సిటీ**

సత్యదేవుని కల్యాణోత్సవాలపై సమీక్ష



కల్యాణోత్సవ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహిస్తున్న అధికారులు

అన్నవరం, ఏప్రిల్ 28: అన్నవరం సత్యదేవుడి దివ్య కల్యాణోత్సవ ఏర్పాట్లపై ఆదివారం మధ్యాహ్నం పెద్దాపురం ఆర్డీవో సీతారామారావు అధ్యక్షతన ఈవో రామచంద్రమోహన్ వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది స్వామివారి దివ్య కల్యాణోత్సవాలు మే 18న ప్రారంభమై 24 వరకు జరగనుండగా 19 రాత్రి వార్షిక కల్యాణ వేదికపై అంగరంగవైభవంగా సత్యదేవుడి కల్యాణం జరగనుంది. ముఖ్యంగా 19 రాత్రి జరిగే కల్యాణోత్సవాలపై వివిధ శాఖల అధికారులకు ఆర్డీవో లక్ష్యాలు నిర్దేశించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఈ ఏడాది కల్యాణాలకు ప్రముఖులు, రాజకీయ నాయకులు వచ్చే అవకాశం లేకపోవడంతో సామాన్య భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చేపట్టాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. కల్యాణం వీక్షించేందుకు సుమారు 15 వేలమంది భక్తులు విచ్చేసే అవకాశం ఉందని ప్రాథమికంగా అంచనా వేశారు. కల్యాణ వేదిక ఎదురుగా ప్రత్యేక గ్యాలరీలు, దూరం నుంచి వీక్షించే వారి కోసం ఎల్ఈడీ స్ర్కీన్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కల్యాణం రోజున సాయంత్రం 4గంటల నుంచి భారీ వాహనాలను కొండపైకి అనుమతించకుండా కార్లు, బైక్‌లను అనుమతించాలని నిర్ణయించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు బాధ్యతలు పోలీస్‌శాఖకు అప్పగించారు. ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. కల్యాణోత్సవాలు వారం రోజులు మూడుచోట్ల మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. కల్యాణంరోజున రెండు అగ్నిమాపక యంత్రాలు అందుబాటులో ఉంచాలని ఫైర్ అధికారులను ఆర్డీవో ఆదేశించారు. కల్యాణం అనంతరం ప్రత్యేక కౌంటర్ల ద్వారా పోలీస్‌సిబ్బంది సాయంతో కల్యాణం అక్షింతలు, ప్రసాదం వితరణ చేయాలని సూచించారు. సత్యదేవుడి చక్రస్నానం రోజున పంపా సరోవరంలో కనీస నీటిమట్టం ఉండేలా చూసే బాధ్యతలను ఇరిగేషన్ అధికారులకు అప్పగించారు. స్వామివారి కల్యాణాలు జరిగే వారం రోజులు గ్రామంలో మెయిన్‌రోడ్డు వద్దనున్న మద్యం దుకాణాలు మూయించాలని ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. ఈ ఏడాది స్వామివారి శ్రీపుష్పయోగం అనివేటి మండపంలో చేపట్టాలని నిర్ణయించారు. గోటి తలంబ్రాలు సంప్రదాయం అన్నవరంలో లేనందున పూర్వపు పద్ధతిలో చేపట్టాలని నిర్ణయించారు.

బ్రాహ్మణులంతా ఏకంకావాలి

లక్ష్మీగణపతి హోమంలో పాల్గొన్న నాగబాబు



హోమంలో పాల్గొన్న నాగబాబు దంపతులు

పిఠాపురం, ఏప్రిల్ 28: బ్రాహ్మణ సమాజం అభ్యున్నతి కోసం బ్రాహ్మణులంతా ఏకమవ్వాలని జనసేన ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు సూచించారు. పిఠాపురం పట్టణంలోని విరవాడ రోడ్డులోని బ్రాహ్మణ అగ్రహారంలో ఆదివారం జరిగిన లక్ష్మీగణపతి హోమం పూజా కార్యక్రమాల్లో నాగబాబు, పద్మ దంపతులు పాల్గొన్నారు. అనంతరం నియోజకవర్గంలోని వేదపండితులు, బ్రాహ్మణులు, అర్చకులు, పురోహితులు నాగబాబును కలిసి బ్రాహ్మణ సమాజం ఎదుర్కొంటున్న సమస్యలు గురించి వివరించారు. బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలు గురించి మొట్టమొదటిసారిగా బహిరంగ వేదికపై మాట్లాడిన నాయకుడు పవన్‌కల్యాణ్ అని తెలిపారు. పవన్ పిఠాపురంలో పోటీ చేస్తానని ప్రకటించిన మొదటి రోజే విజయం ఖరారు అయిందని చెప్పారు. పవన్‌కల్యాణ్ పిఠాపురాన్ని టెంపుల్ సర్క్యూట్ సిటీగా అభివృద్ధి చేస్తామని, రూ.100కోట్లు నిధులు తీసుకువచ్చి ఆలయాలను అభివృద్ధి చేస్తామని చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. బ్రాహ్మణుల సమస్యల పరిష్కారాన్ని పాలకులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. తిరుమల తిరుపతి దేవస్థానానికి ఒక గంటలో వచ్చే ఆదాయంతో పిఠాపురం లాంటి చోట్ల ఆలయాలు అన్నింటిని అభివృద్ధి చేయవచ్చునని తెలిపారు. బ్రాహ్మణ సమాజం రాజ్యాధికారంలో సమానత్వం కోసం పోరాడాలని జనసేన జాతీయ మీడియా అధికార ప్రతినిధి వేములపాటి అజయ్‌కుమార్ సూచించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు తోలేటి శిరీష, జబర్దస్త్ ఫేం రాకెట్ రాఘవ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహునికి బంగారు కిరీటం బహూకరణ



స్వామివారికి బహూకరించిన కిరీటం

అంతర్వేది, ఏప్రిల్ 28: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నరసింహస్వామి వారి విగ్రహానికి అలంకరణ నిమిత్తం నెల్లూరుకు చెందిన ఎవర్‌మార్క్ న్యూట్రాసిటికల్స్ ఎల్ఎల్‌పీ సంస్థ అధినేతలు అప్పల రంగనాథం, అప్పలరాజ్‌కుమార్, కవిత, అప్పల దిలీప్ చక్రవర్తి కల్పన రూ.9.70 లక్షల విలువైన 155 గ్రాముల బంగారు కిరీటాన్ని ఆదివారం బహూకరించారు. తొలుత అర్చక స్వాములు బంగారు కిరీటానికి సంప్రోక్షణ, ప్రత్యేక పూజలు నిర్వహించి నరసింహస్వామివారి ఉత్సవ విగ్రహానికి అలంకరించారు. అనంతరం బంగారు కిరీటాన్ని బహూకరించిన దాతలకు అర్చకులు, వేద పండితులచే మహదాశీర్వచనం జరిపించారు. స్వామివారి చిత్రపటం, ప్రసాదాన్ని అందించారు. కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, బోనం సారథి, బోనం రాజు, ఎవర్‌మార్క్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏపీ సెట్‌కు 5452 మంది హాజరు

దివాన్‌చెరువు, ఏప్రిల్ 28: రాజమహేంద్రవరం రీజినల్ పరిధిలో ఆదివారం జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అర్హత పరీక్ష (ఏపీసెట్)కు 5452 మంది అభ్యర్థులు హాజరయ్యారని, పరీక్ష ప్రశాంత వాతావరణంలో జరిగిందని ఏపీ సెట్ రాజమహేంద్రవరం రీజినల్ కోఆర్డినేటర్ ఆచార్య వై.శ్రీనివాసరావు తెలిపారు. ఆంధ్రజ్యోతితో ఆయన మాట్లాడుతూ రాజమహేంద్రవరం రీజియన్ పరిధిలో 11 కేంద్రాలలో పరీక్ష నిర్వహించారన్నారు. దీనికి 6854 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా వారిలో 1402 మంది హాజరుకాలేదని చెప్పారు. 80 శాతం అభ్యర్థులు అనగా 5452 మంది హాజరై పరీక్ష రాశారన్నారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు రాజమహేంద్రవరంలోని ఎస్.కె.వి.టి కళాశాల, శ్రీకందుకూరి రాజ్యలక్ష్మి మహిళా కళాశాలలో ఏర్పాటు చేసిన ఏపీ సెట్ పరీక్షా కేంద్రాలను సందర్శించారు. నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. సహాయ ప్రాంతీయ కోఆర్డినేటర్ ఎస్.లింగారెడ్డి పరీక్షా కేంద్రాలను సందర్శించారు.

స్ట్రాంగ్ రూంల వద్ద పటిష్ట ఏర్పాట్లు చేయాలి

కలెక్టర్ నివాస్

కలెక్టరేట్ (కాకినాడ), ఏప్రిల్ 28: కాకినాడ జిల్లాలో ఒక పార్లమెంట్‌తోపాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జె.నివాస్ ఆదేశించారు. కాకినాడ జేఎన్‌టీయూకేలో ఏర్పాటు చేయనున్న స్ట్రాంగ్‌రూం, కౌంటింగ్ హాలు, రిసెప్షన్ సెంటర్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ అనంతరం వివిధ పోలింగ్ కేంద్రాల నుంచి రిసెప్షన్ సెంటర్‌కు వచ్చే బస్సుల రూట్‌మ్యాప్, వాటి పార్కింగ్‌లపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. అలాగే మీడియా కేంద్రం, భోజనం వసతులు, విద్యుత్తు వంటి అంశాలపై కూడా ప్రత్యేకంగా ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రధానంగా కౌంటింగ్ హాలులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ రామ్‌సుందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి తిప్పేనాయక్, జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్ మోహన్‌ప్రసాద్, డ్వామా పీడీ వెంకటలక్ష్మీ తదితరులు ఉన్నారు.

వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలి

తిరుమల విద్యాసంస్థల చైర్మన్ తిరుమలరావు



మాట్లాడుతున్న తిరుమలరావు

రాజమహేంద్రవరం రూరల్ ఏప్రిల్ 28: విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుని వివిధ అంశాలపై తర్ఫీదు పొందాలని తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరులో గల విద్యాసంస్థల ప్రాంగణంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ సెలవుల్లో కొంత సమయాన్ని జ్ఞానాన్ని పెంపొందించుకొనేందుకు, కొంత సమయాన్ని ఆర్ట్స్ క్రాఫ్ట్ లాంటి వివిధ కళలు అభ్యసించడానికి కేటాయించి సద్వినియోగం చేసుకోవాలన్నారు. పిల్లలు భవిష్యత్‌లో ఐఐటీ, ఎయిమ్స్ వంటి ప్రతిష్టాత్మకమైన జాతీయ కళాశాలల్లో విద్యనభ్యసించాలంటే స్కూల్ స్థాయి నుంచే ఐఐటీ మెడికల్ ఫౌండేషన్ అవసరంపై విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రతి తల్లిదండ్రులు పిల్లలను భవిష్యత్‌లో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనే విధంగా తయారుచేయాలని సూచించారు. సంస్థ డైరక్టర్ సరోజినీదేవి మాట్లాడుతూ తల్లిదండ్రులే పిల్లలకు రోల్ మోడల్‌గా ఉండాలని అన్నారు. ప్రస్తుత సమాజంలో పిల్లలు పుస్తకాలకన్నా ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్‌కు ఎక్కువగా అలవాటు పడ్డారని, వారు పుస్తకాలతో కన్నా మొబైల్‌తో ఎక్కువ సమయం గడిపితే జరిగే నష్టం గురించి వివరించాలని తెలిపారు. విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ వి.శ్రీహరి, పూర్వవిద్యార్థుల తల్లి దండ్రులు కె.చలం, జి.వనజ పాల్గొన్నారు.

పవన్ సభకు తరలిన కూటమి నాయకులు

కిర్లంపూడి, ఏప్రిల్ 28: కిర్లంపూడిలో జరిగిన జనసేన అధినేత పవన్‌కల్యాణ్ సభకు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు భారీసంఖ్యలో తరలివచ్చారు. జగ్గంపేట కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ, జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్, కాకినాడ టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్, జిల్లా మాజీ ప్రతిపక్ష నేత తోట నవీన్ సభ అధ్యక్షత వహించారు. సభ ప్రారంభం నుంచి ముగిసే వరకు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. అయినప్పటికీ సభను విజయవంతం చేయగలిగారు.

గండేపల్లి: కిర్లంపూడిలో పవన్ నిర్వహించిన సభకు మురారి నుంచి జాస్తి వసంత్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున నాయకులు, కార్యకర్తలు వెళ్లారు. టీడీపీ మండలాధ్యక్షుడు పోతుల మోహనరావు, కందుల చిట్టిబాబు, రామకృష్ణ పాల్గొన్నారు.

చంద్రన్న ప్రభుత్వాన్ని అధికారంలోకి తెచ్చుకుందాం

కాకినాడ సిటీ టీడీపీ కూటమి అభ్యర్థి వనమాడి
ఘాటీ సెంటర్‌లో ప్రజాగళం సభ



ప్రజాగళం సభలో మాట్లాడుతున్న వనమాడి కొండబాబు

కాకినాడ సిటీ, ఏప్రిల్ 28: మోసపూరిత మాయ మాటలతో అధికారంలోకి వచ్చి ఐదేళ్లుగా పేదల సంపదను దోచుకుంటున్న దోపిడీ ప్రభుత్వాన్ని, కాకినాడలో దోపిడీ ద్వారంపూడిని ఇంటికి సాగనంపుదామని, సంపదను సృష్టించి ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి పథంలో నడిపించే చంద్రన్న ప్రభుత్వాన్ని అధికారంలోకి తెచ్చుకుందామని ఆంధ్ర రాష్ట్ర ప్రజలు ఎదురు చూస్తున్నారని కాకినాడ సిటీ అసెంబ్లీ టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థి వనమాడి కొండబాబు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా జగన్నాథపురం ఘాటీ సెంటర్‌లో ఆదివారం ఆయన ప్రజాగళం సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెమ్మాడి పరమ శివవర్మ, మజ్జి లక్ష్మణ్, రాళ్లపూడి ప్రకాష్, పొట్నూరి నాని సహా పెద్దసంఖ్యలో వారి అనుచరులతో టీడీపీలో చేరారు. సభలో నియోజకవర్గ పరిశీలకుడు దేశంశెట్టి లక్ష్మీనారాయణ, మాజీ ఎమ్మెల్సీ రుద్రరాజు పద్మరాజు, వనపర్తి బద్రి, బలసాడి రంగారావు, పిల్లి శివకుమార్ ప్రసంగించారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో ఐదు రెట్లు పెంచిన పన్నులు, నిత్యావసర వస్తువుల ధరలతో పేదల రక్తం జలగల్లా పీల్చి దోచుకున్నారన్నారు. వైసీపీ ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ప్రజలను మోసం చేశారన్నారు. రాష్ట్ర పరిస్థితుల దృష్ట్యా సంపదను సృష్టించే టీడీపీ, జనసేన, బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. కాకినాడ అభివృద్ధిని విస్మరించి నగర ప్రజల ఆస్తులను ప్రజాధనాన్ని ప్రకృతి వనరులను ఎమ్మెల్యే ద్వారంపూడి దోచుకున్నాడన్నారు. సొంత ప్రయోజనాల కోసం, అక్రమ సంపాదన కోసం తప్ప నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడిన దాఖలాలు లేవన్నారు. వైసీపీ దోపిడీ రాజ్యాన్ని అరికట్టి ప్రజల సొమ్మును కాపాడాలంటే వచ్చే ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించి నరేంద్ర మోదీ, చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ సారథ్యంలో చంద్రన్న ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుని ఆంధ్ర రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జిలు పాలిన నాని, మేడిశెట్టి చిన్ని, గెడ్డం పూర్ణచంద్రశేఖర్, సంగాని నాగూర్, సంగాని గంగాధరం, నాయకులు సంగిశెట్టి అశోక్, గుత్తుల రమణ, కామాడి సీత దశరథుడు, కడియాల సత్యనారాయణమూర్తి, పెమ్మాడి నాగేశ్వరావు, కానూరు రాంబాబు, సాక ప్రవీణ్, పెదపూడి కుమార్, నులుకుర్తి సాయి, శ్రీనివాసచౌదరి, బుట్టా లీల పాల్గొన్నారు.

పలు డివిజన్ల నుంచి భారీగా చేరికలు

నగరంలోని పలు డివిజన్ల నుంచి పెద్దసంఖ్యలో యువకులు, మహిళలు ఆదివారం కొండబాబు నివాసం వద్ద టీడీపీలో చేరారు. కాకినాడ సిటీ కూటమి అభ్యర్థి వనమాడి కొండబాబు వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. 9వ డివిజన్ నుంచి యాదవ కమ్యూనిటీ నాయకులు ఇసరపు అశోక్‌కుమార్, దేవ లోవరాజు, గొర్ల అప్పరాజు వారి అనుచరులు, ఇదే డివిజన్ దుర్గానగర్ ప్రాంతానికి చెందిన ములికి శ్రీనివాస్ వారి అనుచరులు టీడీపీలో చేరారు. 5వ డివిజన్ నాయకులు కోటి ఫ్రెండ్స్ అండ్ యూత్ వారి అను చరులు, 32వ డివిజన్ నాయకులు దారపు స్వామిరాజురెడ్డి వారి అనుచరులు, 43వ డివిజన్ నాయకుడు పిడకా శేషు వారి అనుచరులతో టీడీపీలో చేరారు.

పలు డివిజన్లలో జోరుగా ప్రచారం

స్థానిక 10వ డివిజన్ దుమ్ములపేట శ్రీరామ్ సెంటర్‌లో వనమాడి హేమంత్‌కుమార్ పర్యటించి కూటమి అభ్యర్థి వనమాడి కొండబాబును సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాల్సిందిగా కోరారు. స్థానిక 27వ డివిజన్‌లో వనమాడి శివప్రసాద్ ఎన్నికల ప్రచారం సాగించారు.



కొండబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీడీపీలో చేరినవారు

ఇన్నోవా బోల్తా : వ్యక్తి మృతి

ముగ్గురికి స్వల్పగాయాలు, మరో ముగ్గురికి తీవ్రగాయాలు



ప్రమాదానికి గురైన కారు

ప్రత్తిపాడు, ఏప్రిల్ 28: ప్రత్తిపాడు మండలం ధర్మవరం జాతీయ రహదారిపై ఆదివారం ఇన్నోవా కారు ప్రమాదానికి గురైన సంఘటనలో గుంటూరు జిల్లా తెనాలికి చెందిన వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తెనాలికి చెందిన స్నేహితుల బృందం విశాఖలోని స్నేహితులను కలిసేందుకు వెళ్లి తిరిగి ఇన్నోవా కారులో ఆదివారం ఉదయం అన్నవరం చేరుకున్నారు. సత్యదేవుని దర్శించుకున్న అనంతరం ఈ బృందం కారులో తెనాలికి బయల్దేరారు. డ్రైవర్‌లో కలిసి ఏడుగురు వ్యక్తులు ప్రయాణిస్తున్న ఈ కారు ధర్మవరం కోల్డ్ స్టోరేజ్ జంక్షన్ వద్ద టైర్ పంక్చర్ కావడంతో కారు బోల్తా పడింది. ఈ దుర్ఘటనలో డ్రైవర్ వెనుక సీటులో కూర్చున్న తెనాలికి చెందిన సిరిగిరి నరేష్(35)తీవ్రంగా గాయపడి మృతిచెందాడు. కారులో ప్రయాణిస్తున్న ఆరుగురిలో ముగ్గురికి స్వల్పగాయాలు, మరో ముగ్గురుకు తీవ్రగాయాలు కాగా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రత్తిపాడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం కేసులో నలుగురి అరెస్టు

పిఠాపురం, ఏప్రిల్ 28: పిఠాపురం పట్టణం, మండలంలో బయటపడిన మద్యం నిల్వల వ్యవహారంలో నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. పిఠాపురంలో పట్టణంలోని జగ్గయ్యచెరువు కాలనీ, మండలంలోని కుమారపురం గ్రామంలోని ఇంటిలో పోలీసులు, సెబ్ అధికారులు దాడులు నిర్వహించి భారీగా మద్యం నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. దీనిని గోవా మద్యంగా గుర్తించారు. జగ్గయ్యచెరువు కాలనీ సంఘటనకు సంబంధించి వట్టూరి సతీష్‌కుమార్, వ్యాన్ డ్రైవర్ గాది వెంకటరమణను, కుమారపురం కేసులో వేమగిరి శేఖర్‌బాబు, జగ్గంపేట మండలం రాజపూడికి చెందిన కర్నాటి వెంకటేష్‌లను అరెస్టు చేసినట్టు పిఠాపురం సీఐ శ్రీనివాస్ ఆదివారం రాత్రి తెలిపారు. కోర్టుకు హాజరు పరచగా రిమాండ్ విధించినట్టు ఆయన చెప్పారు. కాగా సెబ్ అధికారులు నమోదు చేసిన రెండు కేసులకు సంబంధించిన వివరాలు బయటపెట్టకుండా వారు గోప్యత పాటించడం అనుమానాలకు తావిస్తున్నది. ఈ రెండు కేసుల్లో వైసీపీ నేతలను తప్పించే ప్రయత్నాలు చేస్తున్నట్టు ఆరోపణలు వెలువెత్తుతున్నాయి.

జనసేన అధినేత పవన్‌కు మద్దతుగా ప్రచారం





పిఠాపురంలో ప్రచారం నిర్వహిస్తున్న పద్మ, పిఠాపురం రూరల్:బి.ప్రత్తిపాడులో ప్రచారం నిర్వహిస్తున్న డీకే చైతన్య ఆదికేశవులు

పిఠాపురం, ఏప్రిల్ 28: జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు మద్దతుగా పట్టణంలోని జగ్గయ్యచెరువు కాలనీలో జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు సతీమణి పద్మ ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటా తిరుగుతూ పవన్‌కల్యాణ్‌కు ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో బీజేపీ ఇన్‌చార్జి కృష్ణంరాజు సతీమణి దివ్యరాజు, జనసేన నాయకులు గంటా స్వరూప, చల్లా లక్ష్మి, కడలీశ్వరి, శంకరగౌడ్, రంగబాబు, అల్లం కిషోర్, తేజ, చంద్రశేఖర్,కూటమి నాయకులున్నారు.

పిఠాపురం రూరల్: పవన్ కల్యాణ్‌తోనే పిఠాపురం అభివృద్ధి సాధ్యమవుతుందని జనసేన నేత డీకే చైతన్య ఆదికేశవులు అన్నారు. పిఠాపురం మండలం బి.ప్రత్తిపాడు గ్రామంలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులతో కలిసి ఆదివారం ఆమె జనసేన అభ్యర్థులకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ఊటా నానిబాబు, మొయిళ్ల నాగబాబు తదితరులు ఉన్నారు. పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ పవన్‌కల్యాణ్‌కు మద్దతుగా పిఠాపురం మండలం పి.రాయవరంలో ఆదివారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటా ప్రచారం నిర్వహించి కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు సకుమళ్ల గంగాధర్, బెజవాడ సురేష్, సికోలు చిట్టిబాబు, మహేంద్రవాడ సత్యనారాయణ, మాదేపల్లి రాజా, బర్ల అప్పారావు, దొడ్డు నాగు, అడ్డగర్ల శివ తదితరులున్నారు.

గొల్లప్రోలు రూరల్: నిజాయితీకి నిలువుటద్దం పవన్‌కల్యాణ్ అని కాపు పరిరక్షణ సమితి నేత దాసరి రాము అన్నారు. పవన్‌కు మద్దతుగా గొల్లప్రోలు మండలం చేబ్రోలులో ఆదివారం టీడీపీ, జనసేన, బీజేపీ నేతలతో సమావేశం నిర్వహించారు. పవన్ కోసం అందరు కలిసికట్టుగా పనిచేయాలని కోరారు.

కొత్తపల్లి: రాష్ట్రంలో త్వరలోవచ్చేది రైతు ప్రభుత్వమని టీడీపీ రాష్ట్ర అధికారప్రతినిధి వర్మ అన్నారు. రమణక్కపేటలో పవన్‌కు మద్దతుగా రైతులతో సమావేశం నిర్వహించారు. ఎటువంటి స్వార్థలేకుండా రాష్ట్రంలో టీడీపీకి అండదండగా నిలబడిన పవన్ పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నందున గాజుగ్లాసు గుర్తుకు ఓటువేసి అత్యధిక మెజార్టీతో విజయం చేకూర్చాలని అన్నదాతలను అభ్యర్థించారు. వాకతిప్పలో పీసీసీ డీసీ1చైర్మన్ సానా రాంబాబు, జనసేన నాయకుడు సానా నాగు ఆధ్వర్యంలో పవన్ విజయం చేకూర్చాలని ఓటర్లను కోరారు.

కూటమి అభ్యర్థి విజయంతోనే సమస్యల పరిష్కారం

కాకినాడ రూరల్
జనసేన అభ్యర్థి పంతం నానాజీ



కాకినాడ రూరల్: సమావేశంలో మాట్లాడుతున్న నానాజీ

కాకినాడ రూరల్, ఏప్రిల్ 28: రూరల్ మండలంలోని గ్రామాల్లో గల సమస్యల పరిష్కారం టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థి విజయంతోనే సాధ్యమవుతుందని కాకినాడ రూరల్ నియోజకవర్గం జనసేన అభ్యర్థి పంతం నానాజీ అన్నారు. చీడిగలో ఆదివారం సాయంత్రం మాజీ సర్పంచ్ పితాని అప్పన్నఆధ్వర్యంలో టీడీపీ కోఆర్డినేటర్ పిల్లిసత్తి బాబు, మాజీ ఎమ్మెల్యే అనంతలక్ష్మి, పంతం సందీప్ గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం నిర్వహించిన టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో నాయకులు పాల్గొన్నారు. నానాజీ మాట్లాడుతూ చీడిగలోని సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తానన్నారు. గ్రామంలోని వైసీ పీ నాయకులు పితాని వెంకటరమణ టీడీపీలోనూ దెయ్యాలశ్రీనివాసరావులు జనసేనలోనూ చేరగా వారికి నానాజీ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు కటకంశెట్టి ప్రభాకర్, నాగబాబు, రామలింగేశ్వరరావు, మహేష్, రామకృష్ణ, శివ, శ్రీను,రాంప్రసాద్, కృష్ణమోహన్ ఉన్నారు.

పలువురు జనసేనలో చేరిక

కరప, ఏప్రిల్ 28: పెద్దాపురప్పాడు గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు బిరుదా త్రిమూర్తులు (బూన్) తన అనుచరులతో కలిసి ఆదివారం జనసేనలో చేరారు. కరపలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి పంతం నానాజీ హాజరై వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. టీడీపీ నేత పెంకే శ్రీనివాసబాబా, జనసేన నాయకులు బోగిరెడ్డి కొండబాబు, గంగాధర్, రెడ్డిపల్లి భాస్కర్, గరగ పకీర్రావు, యాళ్ల పండు పాల్గొన్నారు.



కరప: కండువా కప్పి జనసేనలోకి ఆహ్వానిస్తున్న నానాజీ

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం • తుని ● ప్రత్తిపాడు ● జగ్గంపేట


ఓటర్ స్లిప్‌ల పంపిణీకి చర్యలు

కార్పొరేషన్ (కాకినాడ), ఏప్రిల్ 28: మే 13న జరగనున్న ఎన్నికలకు సంబంధించి ఓటర్ స్లిప్‌లను పంపిణీ చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆర్వో జె.వెంకటరావు తెలిపారు. ఆదివారం బీఎల్‌వోలతో సమావేశమై సిటీ పరిధిలోని 234 పోలింగ్‌బూత్‌ల పరిధిలో పంపిణీ చేసేందుకు ఇప్పటికే ఓటర్ ఇన్ఫర్మేషన్ స్లిప్‌లను సిద్ధం చేశామన్నారు. సోమవారంనుంచి ఓటర్ స్లిప్‌ల పంపిణీ ప్రక్రియ జరుగుతుందన్నారు. 1న ఇవ్వాల్సిన పింఛన్ల పంపిణీతోపాటు ఇతర అంశాలపై సూచనలు ఇచ్చారు.

సంక్షేమం, అభివృద్ధి చంద్రబాబుకే సాధ్యం

పెద్దాపురం టీడీపీ కూటమి అభ్యర్థి చినరాజప్ప

సామర్లకోట, ఏప్రిల్ 28: సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా చూస్తూ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపే సత్తా చంద్రబాబుకే సాధ్యమని పెద్దాపురం నియోజకవర్గ టీడీపీ కూటమి అభ్యర్థి చినరాజప్ప అన్నారు. సామర్లకోట మండలం అచ్చంపేటలో ఆదివారం రాత్రి టీడీపీ ఎన్నికల ప్రచారం ఇంటింటా నిర్వహించారు. కూటమి పార్టీల నాయకులు విత్తనాల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే తనయుడు నిమ్మకాయల రంగనాగ్, టీడీపీ మండల నాయకులు తోటకూర శ్రీనివాస్, అడ్డాల వెంకన్నబాబు, వింటి బాబ్జీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రచారంలో రాజప్ప మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రం అన్నిరంగాల్లో సర్వనాశనమైందన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉండి యువత ఉద్యోగావకాశాలు లేక ఆర్థిక కష్టాలు పడుతున్నారన్నారు. మే 13న జరగనున్న ఎన్నికల్లో కాకినాడ పార్లమెంటరీ అభ్యర్థిగా జనసేన తరఫున పోటీ చేస్తున్న తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, పెద్దాపురం అసెంబ్లీ అభ్యర్థిగా మూడోసారి పోటీ చేస్తున్న తనను గెలిపించాలని రాజప్ప కోరారు. మహిళలు రాజప్పకు మంగళహారతులు ఇచ్చారు. ప్రచారంలో అచ్చంపేట టీడీపీ నాయకులు వీరంరెడ్డి పెదబాబు, మునిరెడ్డి శ్రీరాములు, మునిరెడ్డి రాంబాబు, ముమ్మిడి సూరిబాబు, కుర్రా నారాయణ స్వామి, జి.సర్వేశ్వరరావు, తమ్మారావు పాల్గొన్నారు.



సామర్లకోట: అచ్చంపేటలో ప్రచారం నిర్వహిస్తున్న రాజప్ప

'జగన్ మేనిఫెస్టో పాత చింతకాయ పచ్చడే'

సీఎం జగన్‌రెడ్డి ప్రకటించిన మేనిఫెస్టో పాతచింతకాయ పచ్చడేనని, ప్రజలు జగన్‌ను నమ్మే రోజులు పోయాయని పెద్దాపురం నియోజకవర్గ కూటమి అభ్యర్థి చినరాజప్ప వైసీపీ విడుదల చేసిన మేనిఫెస్టోపై ఎద్దేవా చేశారు. సామర్లకోటలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే రాష్ట్రంలోని పేద, మధ్య తరగతి ప్రజల ఆర్థిక పరిస్థితులు మెరుగుపడతాయన్నారు. వైసీపీ నాయకుల ప్రలోభాలకు ఎంతమాత్రం లొంగవద్దన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం ప్రజల సంక్షేమం కోసం టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

గుణ్ణం చంద్రమౌళితో చినరాజప్ప భేటీ

రానున్న ఎన్నికల్లో కూటమి పార్టీ అభ్యర్థుల విజయానికి టీడీపీ నిర్వహిస్తున్న ప్రచార కార్యక్రమాలకు హాజరుకావాలని, పార్టీని మరింత బలోపేతం చేసేందుకు సంపూర్ణసహకారాలు అందజేయాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప టీడీపీ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, రామచంద్రపురం ఎన్నికల సమన్వయకర్త గుణ్ణం చంద్రమౌళిని కోరారు. ఈ మేరకు రాజప్ప పెద్దాపురం నియోజకవర్గ టీడీపీ నాయకులు కొండపల్లి కృష్ణమూర్తి, గుమ్మళ్ళ రామకృష్ణ, నున్న రామకృష్ణలతో కలిసి ఆదివారం రాత్రి గుణ్ణం చంద్రమౌళితో భేటీ అయ్యారు. పెద్దాపురం నియోజకవర్గంలో పార్టీ మరింత బలోపేతం అయ్యేందుకు నిర్వహిస్తున్న ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనవల్సిందిగా చంద్రమౌళిని కోరగా మే4న సామర్లకోట మండలం వేట్లపాలెం విచ్చేయనున్నందున తన అనుచరులతో కలిసి గ్రామంలో ప్రచారంలో పాల్గొంటానని హామీ ఇచ్చారు.



సామర్లకోట: గుణ్ణం చంద్రమౌళిని కలిసిన చినరాజప్ప

బూత్ కమిటీలు కష్టపడి పనిచేయాలి

పెద్దాపురం, ఏప్రిల్ 25: త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో బూత్ కమిటీలదే కీలకపాత్ర అని, బూత్ కమిటీలు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు కష్టపడి పనిచేయాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. స్థానిక సుధాకాలనీలో ఉన్న క్యాంపు కార్యాలయంలో ఆయన సామర్లకోట మండల స్థాయి బూత్ కమిటీలతో ఆదివారం సమావేశమయ్యారు. ఎన్నికల్లో ప్రతీ కార్యకర్త ఎంతగానో కష్టపడాలని, పార్టీ విజయానికి ప్రతీ ఒక్కరూ అహర్నిశలు పనిచేయాలన్నారు. ముఖ్యంగా బూత్ కమిటీలు మరింత సమర్థవంతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సామర్లకోట 22వ వార్డుకు చెందిన కౌన్సిలర్ పితాని కృష్ణ చిన రాజప్ప సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. టీడీపీ నేతలు రాజాసూరిబాబురాజు, అడబాల కుమార్స్వామి, పాలకుర్తి శ్రీనివాసాచార్యులు, తోటకూర శ్రీనివాస్, పెంకే వెంకటేష్, గుమ్మళ్ల రామకృష్ణ, ఆకునూరి సత్తిబాబు, బీజేపీ నేత విత్తనాల వెంకటరమణ పాల్గొన్నారు.

టీడీపీ కూటమికి అనూహ్య స్పందన

తుని అభ్యర్థి యనమల దివ్య



సూపర్ సిక్స్ పథకాలపై వివరిస్తున్న యనమల దివ్య

తొండంగి, ఏప్రిల్ 28: టీడీపీ-జనసేన-బీజేపీ కూటమికి గ్రామాల్లో అనూహ్య స్పందన లభిస్తోందని తుని కూటమి అభ్యర్థి యనమల దివ్య అన్నారు. ఆదివారం ఆమె తాటియాకుల పాలెం నర్సిపేట గ్రామాల్లో బాబుష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో టీడీపీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలపై వివరించారు. వైసీపీ పాలనపై విసిగిపోయిన ప్రజలు టీడీపీ కూటమికి విజయం చేకూర్చేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. అన్ని గ్రామాల్లో ప్రజల నుంచి మద్దతు లభిస్తోందన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే తమ కష్టాలు తీరుతాయన్న ఆలోచన ప్రతి ఒక్కరిలో ఉందన్నారు. మాజీ మేయర్ సుంకర పావని, యనమల నాగేశ్వర్రావు, యనమల రాజేష్, చొక్కా అప్పారావు, చొక్కా కాశీ, చేడిశెట్టి గణేష్,వెలుగుల గోపాల కృష్ణ,అంగులూరి సుధాకర్ ఉన్నారు.

వాసంశెట్టి సుభాష్ ఎన్నికల ప్రచారం



సుభాష్‌కు హారతి ఇచ్చిన మహిళ

కాజులూరు, ఏప్రిల్ 28: మండలంలోని కొయ్యేరు గ్రామంలో రామచంద్రపురం టీడీపీ కూటమి అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యకర్తలు, నాయకులతో కలిసి ఇంటింటా ప్రచారం చేస్తూ మేనిఫెస్టోలో సూపర్ సిక్స్ పథకాలు వివరించి కరపత్రాలు అందజేశారు. మహిళలకు శుభాష్‌కు హారతులిచ్చారు. అలాగే మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు సుభాష్‌కు మద్దతు తెలుపుతూ ప్రచారంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు పేపకాయలబాబ్జి, జనసేన మండ లాధ్యక్షుడు బొండా వెంకన్న, డేగల సతీష్, గుణ్ణం వీరబ్రహ్మం, టీడీపీ నాయకులు రేవు శ్రీను, గుబ్బల ఏసురాజు, మాజీ ఎంపీపీ యాళ్ళ కృష్ణారావు, డాక్టర్‌బాబు, అన్నవరం ఉన్నారు.

పాయకరావుపేట ఎన్నికల పరిశీలకులుగా డాక్టర్ చప్పిడి



సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 28: అనకాపల్లి జిల్లా పాయకరావుపేట టీడీపీ ఎన్నికల పరిశీలకులుగా కాకినాడ రూరల్ మండలానికి చెందిన పార్టీ రాష్ట్ర ఆరోగ్య విభాగ కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావును రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. తనపై నమ్మకంతో పరిశీలకులుగా నియమించిన టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు, రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడులకు వెంకటేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు. చప్పిడిని మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మిసత్యనారాయణమూర్తి, చంద్రబాబు టూర్ కోఆర్డినేటర్ పేరాబత్తుల రాజశేఖర్ అభినందించారు.

ఏపీ ఎన్‌జీవో మహిళా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలుగా జయలక్ష్మి

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 28: ఏపీ ఎన్‌జీవో మహిళా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలుగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యవసాయశాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షురాలు వి.జయలక్ష్మి ఎన్నియ్యారు. ఆదివారం విజయవాడలో నిర్వహించిన వ్యవసాయశాఖ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యవర్గం సంఘం ఎన్నికల్లో జయలక్ష్మిని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆమెను జిల్లా ఉద్యోగుల సంఘం కార్యదర్శి భైరవమూర్తి, రాష్ట్ర సంఘం కౌన్సిలర్ పిండి ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి సీతారామరాజు, ఏఈఓల సంఘం అధ్యక్షులు వేణుమాధవరావు, రాజారత్నం,గోవిందు తదితరులు అభినందించారు.

సానా సతీష్‌కు సంగిశెట్టి అభినందన



కాకినాడ సిటీ, ఏప్రిల్ 28: టీడీపీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎన్నికల కోఆర్డినేటర్‌గా నియమితులైన సానా సతీష్‌ను జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి సంగిశెట్టి అశోక్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. నియోజకవర్గాల్లో కూటమి ఎన్నికల ప్రచారంపై కాసేపు మాట్లాడుకున్నారు.

నల్లమిల్లి సనాతని ప్రచారం



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న నల్లమిల్లి సనాతని

కాకినాడ సిటీ, ఏప్రిల్ 28: అనపర్తి నియోజకవర్గం పెదపూడి మండలం గొల్లల మామిడాడ గ్రామం పాటిమీద ఆదివారం యువ నాయకురాలు నల్లమిల్లి సనాతని ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి త్వరలో జరగబోయే ఎన్నికల్లో అనపర్తి అసెంబ్లీ ఎన్డీఏ అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి, రాజమహేంద్రవరం పార్లమెంట్ ఎన్డీఏ అభ్యర్థి దగ్గుపాటి పురందేశ్వరిని కమలం గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. ఎన్డీఏ నాయకులు ఉన్నారు.

వైసీపీకి చరమగీతం పాడేందుకు సిద్ధం

» ముమ్మిడివరం టీడీపీ కూటమి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు » ఎన్నికల ప్రచారంలో మహిళలు హారతులు

తాళ్లరేవు, ఏప్రిల్ 28: రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని ముమ్మిడివరం టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు అన్నారు. ఆదివారం కోరింగ పంచాయతీ గ్రామకమిటీ అధ్యక్షుడు వెంటపల్లి చంద్రమౌళి ఆధ్వర్యంలో కోరింగ పంచాయతీ సీతారామపురం, కోరింగ, పాతకోరింగ, బొడ్డువానిలంక గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాళీకాదేవి ఆలయంలో పూజలు చేసి అమ్మవారిని దర్శించుకుని ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దాట్ల బుచ్చిబాబు మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం అందించడంతోపాటు సంపద సృష్టించే సత్తాకలిగిన ఉమ్మడి కూటమి ప్రభుత్వ స్థాపనకు ప్రజలంతా సైకిల్ గుర్తుపై ఓటువేసి కూటమి అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. దళితుల సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేసి 27 సంక్షేమ పథకాలను జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం రద్దుచేసిందని, ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రద్దుచేసిన పథకాలను పునరుద్ధరిస్తామని బుచ్చిబాబు అన్నారు. దళిత గ్రామాల్లో రహదార్లు, డ్రైనేజీలు, తాగునీరు, విద్య వైద్యం వంటి సదుపాయాలను కల్పించేందుకు కృషిచేస్తామన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా దాట్ల బుచ్చిబాబుకు గ్రామాల్లో మహిళలు హారతులతో బ్రహ్మరథం పట్టారు. అడుగడుగునా నీరాజనాలు పలికారు. మాఓట్లు మీకే వేసి గెలిపించుకుంటామని రాష్ట్రంలో చంద్రబాబు, నియోజకవర్గంలో బుచ్చిబాబులు రావాలని కోరుకుంటున్నామని మహిళలు మద్దతు తెలిపారు.



దాట్ల బుచ్చిబాబుకు హారతులు ఇస్తున్న మహిళలు

'సైకో పాలన పోవాలి'

రాష్ట్రంలో సైకో పాలనపోయి చంద్రబాబు ముఖ్యమంత్రిగా వస్తే రాష్ట్రం అభివృద్ధి చెంది ప్రజలకు కావాల్సిన మౌలిక వసరాలు సమకూరుతాయని మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు అన్నారు. జవాబుదారి ప్రభుత్వం వస్తే ప్రజలంతా స్వేచ్ఛగా జీవించే అవకాశం ఉంటుందని, ప్రజలు స్వయం కృషితో సంపాదించుకుని సుఖంగా ఉండగలుగుతారని అన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

వైసీపీ పాలనపై విసుగుచెంది పటవల గ్రామానికి చెందిన కాపు సోదరులు వైసీపీ నాయకులు గాజుల విష్ణుచక్రం ఆధ్వర్యంలో 60మంది టీడీపీలో చేరారు. వారికి దాట్ల బుచ్చిబాబు పార్టీ కండువాలను కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. టీడీపీ నేతలు టేకుమూడి లక్ష్మణరావు, మాజీసర్పంచ్ బీర మాలయ్య, భజన సత్తిబాబు, సిద్దన సీతారామయ్య ఉన్నారు.

పోలీసులు అప్రమత్తంగా ఉండాలి

జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్



కోరింగ పోలీసుస్టేషన్ వద్ద సూచనలు చేస్తున్న ఎస్పీ

తాళ్లరేవు, ఏప్రిల్ 28: పోలీసు అధికారులు సార్వత్రిక ఎన్నికల విధుల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని కాకినాడ జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. ఆదివారం కోరింగ పోలీసుస్టేషన్ పరిధిలోని పి.మల్లవరం చెక్‌పోస్టును తనిఖీ చేశారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఓటర్లను ప్రలోబపెట్టే మద్యం, డబ్బు, ఉచిత కానుకలు పంపిణీ.. అక్రమ రవాణాలను అరికట్టాలన్నారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. గ్రామాల్లో ఎటువంటి అల్లర్లు, గొడవలు లేకుండా ప్రతీ ఒక్కరు సోదరభావంతో మెలిగేలా చర్యలు చేపట్టాలన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా స్వేచ్ఛగా జరిగేలా అందరూ సహకరించాలన్నారు. జిల్లా పోలీసులు అన్నివేళలా అండగా ఉంటారని, గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కోరింగ ఎస్‌ఐ రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

'అడ్డదారులు తొక్కుతున్న వైసీపీ'

పిఠాపురం, ఏప్రిల్ 28: ఎన్నికల్లో ఓటర్లను మభ్యపెట్టేందుకు వైసీపీ అన్ని అడ్డదారులు తొక్కుతున్నదని జనసేన పిఠాపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ మర్రెడ్డి శ్రీనివాస్ విమర్శించారు. పిఠాపురం మండలం కుమారపురంలోని గోకులం గ్రాండ్ హోటల్‌లో ఆదివారం జనసేన తెలంగాణ అధ్యక్షుడు శంకర్‌గౌడ్‌తో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత అనుచరులకు చెందిన ఇళ్లల్లో కోటికి పైగా విలువైన మద్యం పట్టుబడిందన్నారు. పట్టుబడింది కొంతమేర మాత్రమేనని, ఇందుకు పదింతలకు పైగా నిల్వలు ఉన్నాయని, వాటిపై అధికారులు దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. మద్యం పట్టుబడిన వ్యవహారంలో ఎమ్మెల్యే అభ్యర్థి గీతపై అనర్హత వేటు వేయాలని, చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఎన్నికల కమిషన్‌ను కోరారు. పవన్‌కల్యాణ్ గెలుపుఖాయం కావడంతో ఎలాగైనా ఓడించాలని వైసీపీ నేతలు కుట్రలు పన్నుతున్నారన్నారు.

'కూటమి అభ్యర్థుల గెలుపు తథ్యం'

కలెక్టరేట్ (కాకినాడ), ఏప్రిల్ 28: కాకినాడ పార్లమెంట్ సహా ఏడు అసెంబ్లీ స్థానాల్లో కూటమి అభ్యర్థుల గెలుపు తథ్యమని బీజేపీ కాకినాడ పార్లమెంట్ సమన్వయకర్త యార్లగడ్డ రామ్‌కుమార్, బీజేపీ నరసాపురం ఇన్‌చార్జి ఎనిమిరెడ్డి మాలకొండయ్య, మీడియా ప్యానలిస్ట్ దువ్వూరి సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. కాకినాడ ట్రెజరీ కాలనీలో బీజేపీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో కార్మికులు, రైతులు, విద్యార్థులు, యువకులు, ఉద్యోగులు, చిరువ్యాపారులు వంటి ఏవర్గం సంతోషంగా లేరన్నారు. గత ఐదేళ్లలో ప్రజల పరిస్థితి అత్యంత దయనీయ పరిస్థితిలో ఉన్నారన్నారు.

'పవన్ విజయానికి పనిచేద్దాం'

కొమరగిరి (కొత్తపల్లి), ఏప్రిల్ 28: కులాలకతీతంగా టీడీపీ-జనసేన-బీజేపీ పిఠాపురం నియోజకవర్గ కూటమి అభ్యర్థి పవన్‌కళ్యాణ్ విజయానికి పనిచేద్దామని దక్షిణ భారత జేఏసీ కన్వీనర్ దాసరి రాము అన్నారు. కొమరగిరిలో ఆదివారం నిర్వహించిన కాపు, తెలగా, బలిజ ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పవన్ అందరి మనిషన్నారు. కులాలు, మతాలకతీతంగా సమస్యలపై పోరాటం చేసే పవన్‌ను అత్యధిక మెజార్టీతో నెగ్గించుకోవడం చారిత్రాత్మిక అవసరమన్నారు. ఐకమత్యంగా పనిచేసి ఆయన్ని అసెంబ్లీకి పంపిద్దామని తీర్మానం చేశారు. కొమరగిరి జనసేన అధ్యక్షులు రాసంశెట్టి లోవబాబు, ఆనాల సురేష్, రాజా, ఆనాల వెంకట రామారావు, సూరిబాబు, గోవిందయ్య, బిల్లకుర్తి అనిల్‌రెడ్డి, దాసరి దుర్గారావు, బాల, రమణమూర్తి తదితరులు ఉన్నారు.

అరాచక ప్రభుత్వాన్ని ఓటుతో తరిమికొట్టాలి

ప్రత్తిపాడు కూటమి అభ్యర్థి వరుపుల సత్యప్రభ



ప్రత్తిపాడులో టీడీపీలోకి ఆహ్వానిస్తున్న సత్యప్రభ

ప్రత్తిపాడు, ఏప్రిల్ 28: టీడీపీలో చేరినవారంతా జరగబోయే ఎన్నికల్లో అరాచక వైసీపీ ప్రభుత్వాన్ని ఓటుతో తరిమికొట్టాలని నియోజకవర్గ కూటమి అభ్యర్థి వరుపుల సత్యప్రభ రాజా కోరారు. ప్రత్తిపాడు మండలం పెదశంకర్లపూడి గ్రామానికి చెందిన వైసీపీకి చెందిన 1వ వార్డు మెంబర్ రాసంశెట్టి వీరబాబు ఆదివారం వైసీపీకి రాజీనామా చేశారు. ఈ మేరకు ప్రత్తిపాడులోని టీడీపీ కార్యాలయం వద్ద సత్యప్రభ సమక్షంలో వీరబాబు అనుచరులు టీడీపీలోకి చేరారు. వారికి సత్యప్రభ పార్టీ కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సత్యప్రభ మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి వైసీపీ కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున టీడీపీలో చేరడం శుభ పరిణామం అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వరుపుల రామకృష్ణ, దో నవీన్, సూర్నీడి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు మహిళా అభ్యర్థులు కలిసిన వేళ

ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేస్తున్న ముగ్గురు మహిళా అభ్యర్థులు కలిశారు. ప్రత్తిపాడు, తుని, పాయకరావుపేట నియోజకవర్గాల్లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థులుగా పోటీలో ఉన్న మహిళా అభ్యర్థినులు వరుపుల సత్యప్రభరాజా, యనమల దివ్య, వంగలపూడి అనితలు ఒకచోట కలిశారు. ప్రస్తుత ఎన్నికల సమరంలో ఎంతో బిజీగా తలమునకలైన వీరు ముగ్గురు కలిసేందుకు నాసా స్వచ్ఛంధ సంస్థల ఫౌండర్ ఎన్‌సీహెచ్ ప్రేమదాస్ వర్ధంతి కార్యక్రమం వేదికగా నిలిచింది. తునిలోని నాసా కార్యాలయం వద్ద గల ప్రేమదాస్ విగ్రహానికి వీరు ముగ్గురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమాజానికి నాసా ప్రేమదాస్ అందించిన సేవలు మరుపురానివి, మరువలేనివని నివాళులర్పించారు.



ఒకేచోట కలిసిన సత్యప్రభ, దివ్య, అనితలు

మల్లిశాలకు చేరుకున్న జన చైతన్యయాత్ర రథం

జగ్గంపేట, ఏప్రిల్ 28: రాష్ట్రానికి ప్రత్యేక హోదా, ప్రజా సమస్యలపై ఏపీఆర్‌సీఎస్, ఏఐఎఫ్‌టీయూ, ఏపీఎఫ్, పీఓడబ్ల్యూ తదితర ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సాగుతున్న జన చైతన్యయాత్ర రథం ఆదివారం జగ్గంపేట మండలం మల్లిశాల చేరుకుంది. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య కళాకారులు తమ ఆటపాటలతో ప్రజలు ఉత్తేజపరిచారు. ఏపీఆర్‌సీఎస్ రాష్ట్ర కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి పోరాడాలని పిలుపునిచ్చారు.

బూరుగుపూడిలో..

కిర్లంపూడి, ఏప్రిల్ 28: రాష్ట్రానికి ప్రత్యేక హోదా, ప్రజా సమస్యలపై ఏపీఆర్‌సీఎస్, ఏఐఎఫ్‌టీయూ, ఏసీఎఫ్, పీఓడబ్ల్యూ(స్త్రీ విముక్తి), పీడీఎస్‌యు(విజృంభన), ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సాగుతున్న జనచైతన్య యాత్ర రథం కిర్లంపూడి మండలం బూరుగుపూడికి చేరుకుంది. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య కళాకారులు ఆటపాటలతో ఉత్తేజపరిచారు. ఏపీఆర్‌సీఎస్ రాష్ట్ర కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు, ఏపీఆర్‌సీఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వల్లూరి రాజబాబు, బి.రమేష్, రాష్ట్ర నాయకులు నెలబాలుడు, కొండా దుర్గారావు, భాస్కర్, ఏఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కుంచే అంజిబాబు, పీవోడబ్ల్యు నాయకురాలు బి.గంగ పాల్గొన్నారు.



మల్లిశాలలో పాటలు పాడుతున్న అరుణోదయ బృందం

నేడు పీసీసీ అధ్యక్షురాలు షర్మిల రాక

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 28: కాకినాడ జిల్లా ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల కాకినాడ రూరల్ మండలం అచ్చంపేటకు రోడ్డు మార్గాన చేరుకుంటారని ఆపార్టీ నాయకులు తెలిపారు. విశాఖ నుంచి బయలుదేరి ఉదయం 11 గంటలకు అచ్చంపేట సెంటర్‌కు చేరుకుంటారన్నారు. అక్కడ నుంచి వాహనంపై రోడ్ షో చేస్తూ సర్పవరం జంక్షన్ నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా భానుగుడి, జగన్నాథపురం వంతెన, ఎంఎస్ఎన్ చార్టీస్, యానాం రోడ్డులోని బాలయోగి విగ్రహం వరకు కాకినాడ రూర్, సిటీ ఎమ్మెల్యేకాకినాడ ఎంపీ అభ్యర్థులకు మద్దతుగా రోడ్డు షో ఉంటుందన్నారు. కార్యక్రమాన్ని నాయకులు, కార్యకర్తలు జయప్రదం చేయాలని కోరారు.

నేడు షర్మిల రోడ్‌షో

కాకినాడ సిటీ, ఏప్రిల్ 28: ఈనెల 29న కాకినాడలో జరిగే పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రోడ్‌షోలో పెద్ద సంఖ్యలో పార్టీశ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కాకినాడ సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు దాట్ల గాంధీరాజు కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. సోమవారం ఉదయం 11 గంటలకు స్థానిక అచ్చంపేట సెంటర్ నుంచి రోడ్‌షో ప్రారంభమవుతుందని తెలిపారు. రోడ్‌షోలో ఒకటి, రెండు చోట్ల షర్మిల ప్రజల నుద్దేశించి మాట్లాడతారని ఆయన తెలిపారు.

కాంగ్రెస్ శ్రేణుల ఎన్నికల ప్రచారం

ప్రత్తిపాడు, ఏప్రిల్ 28: మండలంలో ఒమ్మంగిలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఎంఎం.పళ్ళంరాజు, ఎమ్మెల్యే అభ్యర్థి నీరుకొండ సత్యనారాయణలను గెలిపించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పీసీసీ సభ్యుడు దర్నాల కోట శ్రీను ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కొల్లు వీర గణేష్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కొప్పన కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'లోవ'లో భక్తుల కోలాహలం

తుని రూరల్, ఏప్రిల్ 28: ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవ దేవస్థానానికి ఆదివారం తరలివచ్చిన భక్తులతో ప్రాంగణం కోలాహలంగా మారింది. తెలుగురాష్ట్రాల నలుమూలల నుంచి పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులు ప్రత్యేక క్యూలైన్లో బారులు తీరి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. కుటుంబసమేతంగా తరలివచ్చి ఆలయ ప్రాంగణంలో వంటా వార్పు చేసుకుని కుటుంబ సమేతంగా సహపంక్తి భోజనాలు చేశారు. ఆలయానికి వివిధ విభాగాల ద్వారా ఆదివారం రూ.2.76లక్షలు ఆదాయం వచ్చినట్టు ఈవో విశ్వనాధ్‌రాజు తెలిపారు.

నూకాలమ్మ జాతరలో భక్తుల రద్దీ

పెద్దాపురం, ఏప్రిల్ 28: భక్తుల కొంగు బంగారం కాండ్రకోట నూకాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా మూడవ ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఏ ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ సభ్యులు, ఈవో టీవీ సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పర్యవేక్షించారు. భక్తులకు స్వచ్ఛంధ సంస్థల ఆధ్వర్యంలో మజ్జిగ, మంచినీరు సరఫరా చేశారు. సుమారు ఆరు వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని కృపకు పాత్రులయ్యారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

తాళ్లరేవు, ఏప్రిల్ 28: కాకినాడ నడి సముద్రంలో ఉన్న కోరింగ పంచాయతీ పరిధి హోప్‌ఐల్యాండ్ పోలింగ్ కేంద్రాన్ని ఎన్నికల పరిశీలకులు రాజేశ్వర్‌గోయల్, ఐపీఎస్, ప్రదీప్‌కుమార్, ఐఏఎస్ జనరల్ అబ్జర్వర్లు ఆదివారం పరిశీలించారు. ఐఆర్ఎస్ అధికారి రాహుల్‌దినగర్, ఎఫ్ డీవో గోపి, ఆర్ఐ రవితేజ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం

వాకతిప్ప (కొత్తపల్లి), ఏప్రిల్ 28: వాకతిప్ప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 203-2004లో పదోతరగతి చదువుకున్న పూర్వవిద్యార్థులు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆనాటి గురువులను ఘనంగా సత్కరించారు. అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. ఉన్నత పాఠశాలలో రూ.70వేలతో నిర్మించిన అసెంబ్లీ ప్రాంగణం షెడ్‌ను ఆనాటి గురువుల చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేశారు.

అథ్లెటిక్స్ పోటీల్లో నాగబాబు ప్రతిభ

కాకినాడ అర్బన్, ఏప్రిల్ 28: ముంబయ్‌లో సౌమ్య విద్యా విహార్ స్టేడియంలో ఈనెల 26 నుంచి 28 వరకు జరిగిన జాతీయస్థాయి 43వ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో కాకినాడ జిల్లాకు చెందిన యాతం నాగబాబు పరుగు పందెం 800, 400 మీటర్ల విభాగాల్లో బంగారు, రజత పతకాలు సాధించారు. జిల్లా వైద్యఆరోగ్యశాఖ మలేరియా విభాగంలో పనిచేస్తున్న నాగబాబు గతంలో కూడా పలు పోటీల్లో పతకాలు సాధించాడు. నాగబాబును పలువురు అభినందించారు.

నేటి నుంచి వేసవి విజ్ఞాన శిబిరాలు

కరప, ఏప్రిల్ 28: వేళంగి ఉప గ్రంథాలయంలో సోమవారం నుంచి జూన్ 7 వరకు వేసవి విజ్ఞాన శిబిరాలను నిర్వహించనున్నట్టు లైబ్రేరియన్ పాట్నీడి వెంకటరంగయ్య తెలిపారు. దీనిలో భాగంగా ప్రతిరోజూ ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పాఠకులు, విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు. కథలు వినడం, పుస్తక సమీక్ష, కథలు చెప్పడం, స్పోకెన్ ఇంగ్లీష్, పేపర్ క్రాఫ్ట్, డ్రాయింగ్ వంటి అంశాలపై శిక్షణ ఇస్తామని, వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధం

తొండంగి, ఏప్రిల్ 28: మండలంలో గోపాలపట్నంలో ఆదివారం అగ్ని ప్రమాదం సంభవించి ఓ పూరిల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన చలగల సత్తెమ్మ ఇంట్లో వంట చేస్తుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో స్థానికులు మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అదుపులోకి రాకపోవడంతో తుని అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించగా వారు అదుపు చేశారు. డ్వాక్రాకు సంబంధించిన రూ.1.5లక్షల విలువైన నగదు, బంగారు వెండి వస్తువులు, ఇతర సామాగ్రి అగ్నికి ఆహుతి అయ్యాయని, రూ.4లక్షల నష్టం వాటిల్లిందని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని బాధితురాలు వాపోయింది.

వైసీపీ హయాంలో గనులను దోచుకుతింటున్న సునీల్

» ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల వారాహి సభల్లో ధ్వజమెత్తిన కాకినాడ ఎంపీ కూటమి అభ్యర్థి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్



ఏలేశ్వరం వారాహి సభలో మాట్లాడుతున్న తంగెళ్ల ఉదయ్

ఏలేశ్వరం/కిర్లంపూడి, ఏప్రిల్ 29: వైసీపీ అధికారంలోకి వచ్చిన రోజునుంచి నేటి వరకూ ప్రత్తిపాడు నియోజకవర్గంలో గనులను వైసీపీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న చలమలశెట్టి సునీల్ దోచుకుతింటున్నారని కాకినాడ ఎంపీ కూటమి అభ్యర్థి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ ఆరోపించారు. ప్రత్తిపాడు నియోజకవర్గం ఏలేశ్వరంలో జరిగిన జనసేన వారిమి సభలో ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలు పట్టించుకోకుండా వైసీపీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి తమ తమ్ముడు కంపెనీకి రోడ్డు వేయించుకున్నారని విమర్శించారు. జగన్ ప్రభుత్వం ప్రజలకోసం పనిచేస్తుందో.. ప్రజాప్రతినిధుల కోసం పనిచేస్తుందో ప్రజలందరూ ఆలోచన చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రత్తిపాడు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. అనంతరం జగ్గంపేట నియోజకవర్గం కిర్లంపూడిలో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూఏలేరు, సుద్దగడ్డ ఆధునికీకరణ చేస్తానని హామీ ఇచ్చిన సీఎం జగన్ ఒక్క రూపాయి కేటాయించలేదని, కిర్లంపూడిలో జగనన్న ఇళ్లకోసం రూ.కోట్లు వెచ్చించి స్థలాలుకొని ఇవ్వకుండా వదిలేశారని ఆరోపించారు. రోడ్లు, విద్య, పంటనష్టం ఇవ్వడానికి ప్రభుత్వం దగ్గర డబ్బులు లేవన్నారు. కానీ రూ.2500కోట్ల ప్రజాధనం వాడేశారని విమర్శించారు. తాను ఎంపీగా పార్లమెంటులో గొంతెత్తి ప్రజాసమస్యలు వినిపిస్తానన్నారు.

సుంకర పావనిని కలిసిన ఎంపీ అభ్యర్థి ఉదయ్



ఉదయ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పావని తిరుమలకుమార్

కాకినాడ సిటీ, ఏప్రిల్ 28: కాకినాడ మాజీ మేయర్ సుంకర పావని తిరుమల కుమార్‌ను జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి పార్లమెంట్ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉదయ్ శ్రీనివాస్‌కు పావని దంపతులు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. కాకినాడ నగరంలో ఎన్నికల ప్రచారంపై కొద్దిసేపు చర్చించారు. ప్రచారంలో సహకారం అందించాలని ఉదయ్ శ్రీనివాస్ కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.